మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

Circulated to Telangana
Published from Jagitial

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

శనివారం
SATURDAY
12-9-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 2 Volume:2 | సంచిక: 75 Issue: 75


12 సెప్టెంబర్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:17 తిథి పాడ్యమి ఉ. 7:47 వరకు తరువాత విదియ సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం ఉత్తర ఫల్గుని(ఉత్తర) మ. 12:54 వరకు తరువాత హస్త యోగం శుభ మ. 3:05 వరకు కరణం బవ ఉ. 7:47 వరకు బాలవ రా. 7:27 వరకు వర్జ్యం రా. 9:23 నుండి రా. 11:00 వరకు దుర్ముహూర్తం ఉ. 7:44 నుండి ఉ. 8:33 వరకు రాహుకాలం ఉ. 9:09 నుండి ఉ. 10:41 వరకు యమగండం మ. 1:43 నుండి మ. 3:14 వరకు గుళికాకాలం ఉ. 6:07 నుండి ఉ. 7:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు తె. 5:49 నుండి ఉ. 7:23 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:36 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## సమంత, విజయ్, వీవీఎస్‌కు 'సర్' నోటీసులు

**మహేశ్ బాబు, రాజమౌళి తదితరులకూ**

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. వీరిలో హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ఉన్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాలోని వివరాల పరిశీలన నిమిత్తమే ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ జాబితాలో నటుడు మహేశ్ బాబు, ఆయన భార్య నమ్రత, ప్రముఖ తరువాయి 2 వ పేజీలో...



## ఆర్మీ తుపాకుల చోరీలో నలుగురి అరెస్టు

**డీజీపీ సీవీ ఆనంద్ కేసు వివరాలు వెల్లడి**

సికింద్రాబాద్/హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ సెల్ ఆఫ్ ఆర్మీలో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం తరువాయి 2 వ పేజీలో...



## అనలాగ్ పన్నీర్‌పై బ్యాన్

**తయారీ, అమ్మకాలపై ఏడాది పాటు నిషేధం**

**ప్రజారోగ్యం దృష్ట్యా సర్కార్ కీలక నిర్ణయం**

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 'అనలాగ్' (కృత్రిమ) పన్నీర్‌పై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిషేధం ఏడాది పాటు తరువాయి 2 వ పేజీలో...



## అమెరికాలో భారత విద్యార్థికి 30 నెలల జైలు శిక్ష

**టెక్ సపోర్ట్ పేరుతో వృద్ధుడిని మోసం చేసిన వైనం**

ఒక్లహోమా/హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళ్లిన ఓ భారత విద్యార్థి మోసం కేసులో జైలు పాలయ్యాడు. టెక్ సపోర్ట్ పేరుతో వియత్నాం యుద్ధంలో పాల్గొన్న ఓ వృద్ధుడిని మోసగించిన కేసులో వెంకటేశ్వర చాగంరెడ్డి అనే విద్యార్థికి అమెరికా కోర్టు 30 నెలల జైలు శిక్ష విధించింది. దీంతో పాటు బాధితుడికి 99,496 డాలర్లు (దాదాపు రూ. 83 లక్షలు) పరిహారంగా చెల్లించాలని, శిక్ష పూర్తయ్యాక మరో మూడేళ్ల పాటు అధికారుల పర్యవేక్షణలో ఉండాలని ఆదేశించింది. వివరాల్లోకి -2 వ పేజీలో...

# ప్రపంచానికి.. వారధి భారత్

## దేశాల మధ్య వాణిజ్య అవరోధాలు

## వ్యూహాత్మక వారధి కడుతున్న ఇండియా

## బ్రిక్స్ బిజినెస్ ఫోరంలో ప్రధాని మోదీ

ప్రపంచవ్యాప్తంగా వ్యాపార నిబంధనలు, సుంకాలు, ఆంక్షలు పెరిగి ఆర్థిక వ్యవస్థ విభజించబడుతున్న తరుణంలో దేశాల మధ్య ఒక 'వ్యూహాత్మక వారధి'లా భారత్ పనిచేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా నిర్వహించిన 'బిజినెస్ ఫోరమ్' నాయకుల సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించారు.




న్యూఢిల్లీ:సరఫరా గొలుసుల బలోపేతం, ఉచిత వాణిజ్య ఒప్పందాలు, బ్రిక్స్ సభ్య దేశాల మధ్య కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం ద్వారా భారత్ ప్రపంచ వాణిజ్యానికి స్థిరత్వాన్ని అందిస్తోందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ వాణిజ్య వాతావరణం సంక్లిష్టంగా మారుతున్నా, భారత్ పారదర్శకతకు పెద్దపీట వేస్తోందని ప్రధాని పేర్కొన్నారు. "నేడు ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అడ్డంకులు పెరుగుతుంటే, భారత్ మాత్రం ఆర్థిక వంతెనలను నిర్మిస్తోంది. 2014 నుంచి ఇప్పటివరకు మేము దాదాపు 40 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకున్నాం. వ్యాపార ప్రతిబంధకాలను తగ్గించి, కొత్త అవకాశాలను పెంపొందించడమే మా ప్రధాన లక్ష్యం" అని ఆయన అన్నారు. ఈ ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను వహిస్తున్న భారత్.. కేవలం ప్రభుత్వాల మధ్య ఒప్పందాలకే పరిమితం తరువాయి 2 వ పేజీలో...



## రికార్డు స్థాయికి విదేశీ మారక నిల్వలు

**ఒక్క వారంలోనే 45 బిలియన్ డాలర్ల జంప్**

భారత్ విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయికి చేరాయి. సెప్టెంబర్ 4తో ముగిసిన వారంలో ఏకంగా 44.90 బిలియన్ డాలర్లు పెరిగి 785.71 బిలియన్ డాలర్లకు చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) శుక్రవారం వెల్లడించింది.

న్యూఢిల్లీ: అంతకుముందు ఆగస్టు 28తో ముగిసిన వారంలోనూ విదేశీ మారక నిల్వలు 11.47 బిలియన్ డాలర్లు పెరిగి 740.80 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,442 |
| వెండి (కిలో): | రూ.2,,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,457 |

## హైడ్రా పోర్టల్‌లో ఎఫ్‌టీఎల్ వివరాలు

**కొత్త వెబ్ సైట్ ప్రారంభం**

**అందుబాటులో చెరువుల పూర్తిస్థాయి నీటిమట్టం, బఫర్ జోన్ వివరాలు**

**వరద ముంపు ప్రాంతాల మ్యాపులు, వర్షపాతం సమాచారం కూడా**

**భూ రికార్డుల కోసం 'భూ భారతి' పోర్టల్‌కు అనుసంధానం**




హైదరాబాద్ పౌరులకు కీలక సమాచారాన్ని ఒకే వేదికపై అందించే దిశగా హైడ్రా కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా శుక్రవారం తన అధికారిక వెబ్‌సైట్/పోర్టల్‌ను ప్రారంభించింది. ఏజెన్సీ కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఈ పోర్టల్‌ను ఆవిష్కరించారు. చెరువులు, వరదలు, భూ రికార్డుల వంటి పలు ముఖ్యమైన సేవలను ఈ పోర్టల్ ద్వారా ప్రజలు సులభంగా పొందవచ్చు.

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): ఈ పోర్టల్ ద్వారా ముఖ్యంగా ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసే వారికి ఎంతో ప్రయోజనం చేకూరనుంది. చెరువులు, ఇతర నీటి వనరుల సమీపంలో ఆస్తులను కొనుగోలు చేసే ముందు వాటి పూర్తిస్థాయి నీటిమట్టం, బఫర్ జోన్ వివరాలను దీని ద్వారా ధ్రువీకరించుకోవచ్చు. ఇందుకోసం హెచ్ఎండీఏ లేక్స్ పోర్టల్‌కు నేరుగా యాక్సెస్ కల్పించారు. అలాగే జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని వరద, నీటి ముంపు ప్రాంతాల ప్రత్యేక మ్యాపులను కూడా తరువాయి 2 వ పేజీలో...



## మూసీ ప్రాజెక్టుకు చిక్కులు!

**పర్యావరణ అనుమతులపై రిటైర్డ్ ఇంజినీర్ల అభ్యంతరాలు.. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్జీటీ నోటీసులు**

**55 కి.మీ.లో 20 కి.మీ. అధ్యయనంపై ప్రశ్నలు.. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలపై అభ్యంతరం**

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



మెదడును పోలిన ఏఐ
మనిషి మెదడు పనిచేసే తీరును అనుకరించే కొత్త కృత్రిమ మేధ నమూనాను చైనా పరిశోధకులు అభివృద్ధి చేశారు. అవసరమైనప్పుడు మాత్రమే కృత్రిమ నాడీకణాలు క్రియాశీలమయ్యే విధానాన్ని ఉపయోగించడం ద్వారా సంప్రదాయ ఏఐ నమూనాలతో పోలిస్తే విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించినట్లు పరిశోధకులు తెలిపారు. ఈ విధానం రోబోలు, స్వయంచాలక వాహనాలు, ధరించగల పరికరాలు వంటి తక్కువ విద్యుత్‌తో పనిచేయాల్సిన సాంకేతికతలకు ఉపయోగపడే అవకాశం ఉంది. పెద్ద ఏఐ నమూనాలను రూపొందించడమే కాకుండా, తక్కువ శక్తితో వేగంగా పనిచేసే కొత్త తరహా ఏఐ అభివృద్ధికి ఇది మార్గం చూపుతుందని పరిశోధకులు భావిస్తున్నారు.

## పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు

**కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం.. అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం**

తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది.



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం తరువాయి 2 వ పేజీలో...



## రేవంత్ డైరెక్షన్‌లోనే..! నా జుట్టు పట్టి లాగేశారు..

**అసెంబ్లీ ఘటనపై ఎన్‌హెచ్ఆర్సీకి సబిత ఫిర్యాదు**

**డీజీపీకి ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని ఆవేదన**

న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో తమపై జరిగిన దాడి జరిగిందని, అవమానకరమైన ప్రవర్తన ఎదురైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను (ఎన్‌హెచ్ఆర్సీ) -2 వ పేజీలో...



## ఆర్టీఐ బ్లాక్‌మెయిలర్ రేవంత్ వేల ఎకరాలపై సీఎం కన్ను

**రేవంత్ సీఎం అంటే వీరప్పన్ మంత్రి అయినట్లే: కేటీఆర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో, భూ దందాలు చేసే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కూడా తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

12.9.2026

మేషం: వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఆర్థికంగా మరింత పురోగతి కలుగుతుంది. నూతన కార్యక్రమాలు చేపడతారు. ఉద్యోగమున నూతన అవకాశములు అందుతాయి. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు.

వృషభం: విద్యార్థుల ప్రయత్నాలు అనుకూలిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఆశించిన మార్పులు ఉంటాయి. వివాదాలకు సంభందించి విలువైన సమాచారం అందుతుంది. దైవదర్శనాలు చేసుకుంటారు. విందువినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి.

మిధునం: ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. మిత్రులతో అకారణ మాటపట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చులు తప్పవు. ఉద్యోగమున అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. కుటుంబ సభ్యుల నుంచి ధనపరమైన ఒత్తిడి తప్పదు. వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి.

కర్కాటకం: వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగయత్నాలు ముందుకు సాగవు. ఇంటాబయట బాధ్యతలు తప్పవు. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు.

సింహం: పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. బంధువులతో కీలక వ్యవహారాలలో చర్చలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వ్యాపారాలు మరింత అనుకూలిస్తాయి. విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

కన్య: వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. నిరుద్యోగ యత్నాలు సానుకూలమౌతాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో సఖ్యత కలుగుతుంది.

తుల: వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆర్థిక సమస్యలు చికాకు పరుస్తాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత తప్పదు.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. బంధువుల మాటలు మానసికంగా బాధిస్తాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు అధికమౌతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. స్వల్ప ఆరోగ్య సమస్యలు ఉంటాయి.

ధనస్సు: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. నూతన వాహనయోగం ఉన్నది. పాతబాకీలు వసూలవుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

మకరం: కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. చేపట్టిన పనులు మందగిస్తాయి. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. సంతాన విద్యా, ఉద్యోగయత్నాలు నిదానిస్తాయి. వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కుంభం: ఉద్యోగాలలో అధికారులతో చర్చలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలలో సమస్యలు అదిగమిస్తారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుని కష్ట సుఖాలు పంచుకుంటారు. బంధు వర్గం నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

మీనం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారమున భాగస్థులతో వివాదాలు కలుగుతాయి. ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ముఖ్యమైన పనులలో స్వల్ప అవాంతరాలు ఉంటాయి. కొన్ని పనులలో శ్రమ పడినా ఫలితం ఉండదు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి.

# ప్రపంచానికి వారధి భారత్

మొదటి పేజీ తరువాయి

కాకుండా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్టార్టప్‌లకు విస్తృత మార్కెట్, నిధులు, సాంకేతికతను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రాధాన్యతనిస్తోంది. ఈ దిశగా భారత్ బ్రిక్స్ ఇన్‌క్యుబేటర్ నెట్‌వర్క్, బ్రిక్స్ ఎంఎస్‌ఎంఈ పోర్టల్, బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ అనే మూడు కీలక ఇనీషియేటివ్‌లు ప్రారంభించింది. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, నైపుణ్యాభివృద్ధి, స్మార్ట్ గ్రిడ్‌ల వంటి కీలక రంగాలలో ఈ వేదికల ద్వారా పెట్టుబడులు, సాంకేతికత, నైపుణ్యాల రాకపోకలను పెంచాలని బ్రిక్స్ పారిశ్రామికవేత్తలను మోదీ కోరారు. గత కొన్ని ఏళ్లుగా మహమ్మారులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల గ్లోబల్ సప్లై చైన్‌లు దెబ్బతిన్నాయి. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు భారత్ ప్రాధాన్యత ఇస్తోందని ప్రధాని వెల్లడించారు. 'రెసిలియన్స్, ఇన్నోవేషన్, కో-ఆపరేషన్, అండ్ సస్టైనబిలిటీ కోసం నిర్మాణం' అనే థీమ్‌తో సదస్సును నిర్వహిస్తోంది. గడచిన 12 ఏళ్లుగా భారత్ తన ఆర్థిక, వాణిజ్య విధానాలకు ఈ మంత్రాన్నే ప్రాతిపదికగా చేసుకుంది. ప్రపంచంలో అనిశ్చితి ఉన్నప్పటికీ భారత్ స్థిరమైన ప్రగతిని, నమ్మకాన్ని ఇస్తోందని మోదీ పేర్కొన్నారు.

### మౌలిక వసతులు, వ్యూహాత్మక సాంకేతికతలు

భారత ఆర్థిక వ్యూహంలో మౌలిక సదుపాయాల విస్తరణ ప్రధాన స్తంభంగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. రహదారులు, రైల్వేలు, రేవులు, విమానాశ్రయాల వేగవంతమైన విస్తరణ లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గిస్తోందని మోదీ అన్నారు. అదే సమయంలో, దేశభద్రత, ఆర్థిక భద్రతకు అత్యంత కీలకమైన వ్యూహాత్మక రంగాలపై భారత్ దృష్టి సారించిందని తెలిపారు. సెమీకండక్టర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, కీలక ఖనిజాలు, బయోటెక్నాలజీ అండ్ షిప్‌బిల్డింగ్ ఈ రంగాల విస్తరణ ద్వారా భారత్ కేవలం సరుకులను కొనుగోలు చేసే మార్కెట్‌గా మాత్రమే కాక, ప్రపంచ సరఫరా వ్యవస్థలో ఒక ప్రధాన ఉత్పత్తిదారుగా, సరఫరాదారుగా మారుతుందని అన్నారు. భారత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ముఖ్యంగా యూపీఐ సాంకేతికతను మోదీ సభకు వివరించారు. నేడు ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం రియల్ టైమ్ డిజిటల్ లావాదేవీలలో 50% కంటే ఎక్కువ ఒక్క భారతదేశంలోనే ఈ సాంకేతికత ద్వారా జరుగుతున్నాయి. ఉపాధి, వ్యాపారాలలో సామాన్యులను భాగస్వాములను చేస్తూ, లావాదేవీలను వేగవంతం, చవకగా చేయడంతో యూపీఐ మోడల్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, సౌత్ ఆఫ్రికా మాత్రమే కాకుండా ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇండోనేషియా చేరికతో కూటమి బలం 11 దేశాలకు చేరింది. ప్రపంచ జనాభాలో 49.5%, ప్రపంచ జీడీపీలో 40%, ప్రపంచ వాణిజ్యంలో 26% వాటాను ఈ బ్రిక్స్ కూటమి కలిగి ఉంది. న్యూఢిల్లీలో జరిగిన ఈ సమావేశం ద్వారా కేవలం రాయబార సంబంధాలకే కాక, బ్రిక్స్ దేశాల భారీ వినియోగ మార్కెట్లు, శక్తి వనరులు, తయారీ రంగాలు భారత్ అభివృద్ధికి ఎంతో సహకరిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

### ఇరాన్ అధ్యక్షుడితో భేటీ

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు హాజరైన పలు దేశాధినేతలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో మోదీ భేటీ అయ్యారు. ఇరాన్ అధ్యక్షుడితో జరిగిన సమావేశంలో పశ్చిమాసియాలో నెలకున్న పరిస్థితులు, ప్రాంతీయ స్థిరత్వం అంశాన్ని ప్రధాని మోదీ ప్రస్తావించారు. సముద్ర ప్రయాణికులు, నావికుల భద్రతకు భారత్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా మోదీ స్పష్టం చేశారు. పశ్చిమాసియా సంక్షోభానికి శాశ్వత పరిష్కారం కోసం 'చర్చలు, దౌత్యం' మాత్రమే సరైన మార్గమని భారత్ బలంగా పునరుద్ఘాటించింది. ఇంధన భద్రత అందరికీ అత్యంత కీలకమైన అంశమని, నిత్యావసరాలు, సరుకులతో వెళ్లే నౌకలకు సురక్షితమైన ప్రయాణ మార్గం కల్పించాలని భారత్ పేర్కొంది. ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు, ఆర్థిక మార్గాలను శాశ్వతంగా మూసివేసేందుకు అమెరికా 'ఆపరేషన్ ఎకనామిక్ ఔట్‌కాస్ట్' పేరుతో అత్యంత కఠినమైన చర్యలు తీసుకున్న తర్వాత ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. భారత్‌కు బయలుదేరే ముందు ఆయన మాట్లాడుతూ.. బ్రిక్స్ కూటమి తన ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి, అమెరికా ఆధిపత్యాన్ని ఎదుర్కొనేందుకే 'బ్రిక్స్ బ్యాంక్' ఆవిర్భవించిందని ఆయన వ్యాఖ్యానించారు.




## ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపండి
### పుతిన్‌తో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఉక్రెయిన్ సంక్షోభానికి దౌత్యపరమైన చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని భారత ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిపిన ద్వైపాక్షిక సమావేశంలో ప్రధాని మోదీ యుద్ధాన్ని తక్షణమే ఆపి, శాంతి మార్గాన్ని ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇరు దేశాల మధ్య శాంతిని పునరుద్ధరించేందుకు భారత్ తన వంతు సహాయసహకారాలు అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు విచ్చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఢిల్లీలోని 'భారత్ మండపం' వేదికగా ఇరు నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రష్యన్ భాషలోకి అనువదించిన ప్రముఖ తమిళ ప్రాచీన కావ్యమైన 'తిరుక్కురళ్' ప్రతిని పుతిన్‌కు ప్రత్యేక బహుమతిగా అందజేశారు. దాదాపు రెండు వేల ఏళ్ల నాటి ఈ గ్రంథంలోని మానవతా విలువలను మోదీ ఈ సందర్భంగా పుతిన్‌కు వివరించారు. రాజకీయ, ఆర్థిక, రక్షణ, ఇంధన, అంతరిక్ష రంగాల బలోపేతంపై ఇరు నేతలు సుదీర్ఘంగా చర్చించారు.రష్యాలో జరగబోయే 24వ ఇండో-రష్యా వార్షిక శిఖరాగ్ర సమ్మిట్‌కు హాజరు కావాల్సిందిగా ప్రధాని మోదీని అధ్యక్షుడు పుతిన్ అధికారికంగా ఆహ్వానించగా.. ఆయన ఆ ఆహ్వానాన్ని స్వీకరించారు. దీనికి సంబంధించిన తుది తేదీలను దౌత్య అధికారులు త్వరలోనే ఖరారు చేయనున్నారు.

# మూసీ ప్రాజెక్టుకు చిక్కులు!

మొదటి పేజీ తరువాయి

జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి పర్యావరణ నిబంధనలు, అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని తెలిపారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదించారు. పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం తన వాదనను కూడా వెల్లడించాల్సి ఉంది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. ఇప్పుడు మరో పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16కు వాయిదా వేసింది. ఆ విచారణలో పిటిషనర్లు లేవనెత్తిన పర్యావరణ అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి.

## సమంత, వీవీఎస్‌కు 'సర్' నోటీసులు

మొదటి పేజీ తరువాయి

దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండలతో పాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ కూడా ఉన్నట్లు సమాచారం. ఫార్మా దిగ్గజం మురళీ కృష్ణ ప్రసాద్ దివి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డులతో ప్రస్తుత వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో ఈ నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో నిర్దిష్టమైన కారణం ఏదీ పేర్కొనలేదని కూడా వార్తలు వస్తున్నాయి. నోటీసులు అందుకున్న వారు నేరుగా హాజరై తమ వివరాలను సరిచూసుకోవచ్చని లేదా అవసరమైన పత్రాలను సమర్పించి పొరపాట్లను సరిదిద్దుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.

## అనలాగ్ పన్నీర్‌పై బ్యాన్

మొదటి పేజీ తరువాయి

అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పన్నీర్ పేరిట విక్రయిస్తున్న నాణ్యత లేని, కల్తీ ఉత్పత్తుల వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతున్న నేపథ్యంలో ఈ కఠిన చర్యలు చేపట్టింది. పన్నీర్ పేరుతో చలామణి అవుతున్న డైరీయేతర, కృత్రిమ ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, రవాణా, పంపిణీ మరియు విక్రయాలపై ఈ నిషేధం వర్తిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ఆహార భద్రతా విభాగం (టీజీ సేఫ్) ఉత్తర్వులు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 10వ తేదీ నుంచి ఈ ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే అమల్లోకి వచ్చాయి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ 30(2)(ఖ) ప్రకారం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

## పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు

మొదటి పేజీ తరువాయి

కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.

## హైడ్రా పోర్టల్‌లో ఎఫ్‌టీఎల్ వివరాలు

మొదటి పేజీ తరువాయి

ఇందులో పొందుపరిచారు. వీటితో పాటు వాతావరణ సమాచారం, వర్షపాతం వివరాలు, హైదరాబాద్ డాప్లర్ రాడార్ సమాచారం కూడా అందుబాటులో ఉంటాయి. భూ రికార్డుల కోసం తెలంగాణ ప్రభుత్వ 'భూ భారతి' పోర్టల్‌కు నేరుగా లింక్ ఇచ్చారు. దీని ద్వారా సర్వే నంబర్ లేదా పట్టాదారు వివరాలతో భూ సమాచారాన్ని తెలుసుకోవచ్చు. హైడ్రా చేపడుతున్న చెరువుల పునరుద్ధరణ పనుల పురోగతి, ఫొటోలు, వీడియోలను కూడా ఈ పోర్టల్‌లో వీక్షించవచ్చు. ఏజెన్సీ అధికారిక ప్రకటనలు, అత్యవసర సహాయ సమాచారం కూడా ఇందులో లభిస్తాయి.

## రేవంత్ డైరెక్షన్‌లోనే..!నా జుట్టు పట్టి లాగేశారు..

మొదటి పేజీ తరువాయి

ఆశ్రయించింది. బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలోని మహిళా ఎమ్మెల్యేల బృందం శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతిని కలిసి ఫిర్యాదును అందజేసింది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద పోలీసులు తమ పట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. "మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగుతూ పోలీసులు అరాచకం సృష్టించారు. ఇదంతా ఒక పథకం ప్రకారం, కుట్రలో భాగంగానే జరిగింది" అని ఆమె పేర్కొన్నారు. తమను రక్షించేందుకు ప్రయత్నించిన తోటి ఎమ్మెల్యేలను సైతం పోలీసులు తోసివేసి కిందపడేసి తొక్కారని, ఈ ఘటనలో జగదీశ్‌రెడ్డికి రక్తపోటు పెరిగిందని, పలువురు ప్రజాప్రతినిధులకు గాయాలయ్యాయని వివరించారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతోనే జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు.

## భారత విద్యార్థికి 30 నెలల జైలు శిక్ష

మొదటి పేజీ తరువాయి

వెళ్తే, ఒక్లహామాలో నివసిస్తున్న ఓ వృద్ధుడికి, మైక్రోసాఫ్ట్ టెక్నికల్ సపోర్ట్ ప్రతినిధిగా పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. బాధితుడి కంప్యూటర్‌లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని బెదిరించాడు. భయపడిపోయిన బాధితుడిని, తన వద్ద ఉన్న నగదును బంగారంగా మార్చి, ఇంటికి వచ్చే ఫెడరల్ అధికారికి ఇవ్వాలని సూచించాడు. నిందితుడి మాటలు నమ్మిన బాధితుడు అలాగే చేశాడు. అయితే, కొద్ది రోజుల తర్వాత నిందితుడు మళ్లీ ఫోన్ చేసి, మరింత డబ్బు డిమాండ్ చేశాడు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు, తన కుటుంబ సభ్యుల సహాయంతో తాను మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రెండో విడత డబ్బు తీసుకునేందుకు బాధితుడి ఇంటికి వచ్చిన వెంకటేశ్వర చాగంరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.

## రికార్డు స్థాయికి విదేశీ మారక నిల్వలు

మొదటి పేజీ తరువాయి

వరుసగా రెండో వారంలోనూ భారీగా నిల్వలు పెరిగాయి. మొత్తం నిల్వల్లో కీలకమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్‌సీఏ) భారీగా పెరిగాయి. వారంలో 47.498 బిలియన్ డాలర్లు పెరిగి 648.17 బిలియన్ డాలర్లకు చేరాయి. మార్చి చివరితో పోలిస్తే ఎఫ్‌సీఏ నిల్వలు 95.886 బిలియన్ డాలర్లు పెరిగాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 63.692 బిలియన్ డాలర్ల మేర అధికంగా ఉన్నాయి. అయితే బంగారం నిల్వలు మాత్రం 2.594 బిలియన్ డాలర్లు తగ్గి 113.816 బిలియన్ డాలర్లకు చేరాయి. అయినప్పటికీ ఏడాది క్రితంతో పోలిస్తే బంగారం నిల్వలు 23.517 బిలియన్ డాలర్లు ఎక్కువగా ఉన్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత్ స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) 4 మిలియన్ డాలర్లు తగ్గి 18.806 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐఎంఎఫ్‌లో భారత్ రిజర్వ్ పొజిషన్ మాత్రం 2 మిలియన్ డాలర్లు పెరిగి 4.916 బిలియన్ డాలర్లకు చేరింది. మార్చి చివరి నుంచి చూస్తే దేశ విదేశీ మారక నిల్వలు ఏకంగా 94.599 బిలియన్ డాలర్లు పెరిగాయి. ఏడాది క్రితంతో పోలిస్తే 87.438 బిలియన్ డాలర్ల మేర పెరిగాయి. ఈ స్థాయిలో విదేశీ మారక నిల్వలు ఉండటం అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లలో ఒడుదొడుకులు, బాహ్య ఆర్థిక షాక్‌లను ఎదుర్కొనేందుకు భారత్‌కు బలమైన రక్షణగా నిలుస్తుందని నిపుణులు చెబుతున్నారు.

## వేల ఎకరాలపై సీఎం కన్ను

మొదటి పేజీ తరువాయి

అలాగే ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం కాకముందు రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి బతికేవారని, అలాంటి వ్యక్తి ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఒక ముఠాను ఏర్పాటు చేసి, వారి కనుసన్నల్లో 22ఏ భూ దందా నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి స్కీం వెనుక ఒక స్కాం ఉందని, హిల్ట్ పాలసీ, మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ పేర్లతో వేల ఎకరాల భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి భూదందాలకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో ఫాక్స్‌కాన్ వచ్చిన కొంగరకలాన్ భూములపై రేవంత్ కన్ను పడిందని, అక్కడ రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి సిద్ధమయ్యారని ఆరోపించారు.

## ఆర్మీ తుపాకుల చోరీలో నలుగురి అరెస్టు

మొదటి పేజీ తరువాయి

చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు.

# రైతు నచ్చిన యంత్రం కొనుగోలు

## నచ్చిన కంపెనీ నుంచే పరికరాలు.. సబ్సిడీ నేరుగా ఖాతాలోకి

## యాంత్రీకరణకు రూ.147.91 కోట్లు .. మంత్రి తుమ్మల వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను, నచ్చిన కంపెనీ నుంచి స్వేచ్ఛగా కొనుగోలు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. రైతుల అవసరాలు, డిమాండ్‌కు అనుగుణంగా యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. యాంత్రీకరణ పథకం కింద నాణ్యత, ప్రమాణాలు కలిగిన వ్యవసాయ యంత్రాలను మాత్రమే రైతులకు అందిస్తున్నామని తెలిపారు. తయారీదారులు, సరఫరాదారులు అందించే పరికరాలను ఫార్మ్ మెషినరీ ట్రైనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్‌స్టిట్యూట్ లేదా కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన సంస్థల ద్వారా పరీక్షించిన అనంతరం మాత్రమే సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. రైతుల భద్రత, యంత్రాల నాణ్యత, పనితీరు విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. గతంలో సబ్సిడీపై అందించే పరికరాల ధరలు, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసాలు ఉండేవని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రస్తావించారు. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా యంత్రాలు, డ్రోన్లు అధిక సంఖ్యలో అందుబాటులోకి తేవాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. గతంలో ఉన్న సమస్యలకు ప్రస్తుతం తావులేదన్నారు. రైతు తనకు నచ్చిన పనిముట్టును, తనకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా ప్రస్తుత విధానాన్ని రూపొందించినట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం కేంద్రం అందిస్తున్న నిధులను వినియోగించుకోకుండా యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేసిందని తుమ్మల ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పథకాన్ని పునరుద్ధరించి అమల్లోకి తీసుకొచ్చిందన్నారు.

**రూ.63.11 కోట్లతో 15,565 యంత్రాలు**

2025-26 ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకానికి రూ.71 కోట్లు కేటాయించగా, రూ.63.11 కోట్లు ఖర్చు చేసి 15,565 వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ.147.91 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు అందిస్తున్నామని చెప్పారు. యంత్రాల వినియోగం వల్ల రైతుల శారీరక శ్రమతో పాటు సాగు ఖర్చులు తగ్గి, వ్యవసాయ పనులు సకాలంలో పూర్తయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. యంత్ర పరికరాల ఎంపిక ప్రక్రియలో రైతులకు కూడా భాగస్వామ్యం కల్పించినట్లు తుమ్మల తెలిపారు. ఎంప్యానెల్‌మెంట్ కమిటీలో శాస్త్రవేత్తలు, సాంకేతిక ఇంజనీర్లు, అధికారులు, ఆదర్శ రైతులు, ఎఫ్‌పీవోల ప్రతినిధులను భాగస్వాములను చేసినట్లు చెప్పారు. క్షేత్రస్థాయి అవసరాలు, ప్రాంతాల వారీగా సాగు విధానాలను పరిగణనలోకి తీసుకుని పరికరాల ఎంపిక జరుగుతుందన్నారు. యాంత్రీకరణ పథకం కింద పరికరాలు సరఫరా చేసేందుకు 444 కంపెనీలు ఎంప్యానెల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నాయని తెలిపారు. నిర్దేశిత ప్రమాణాలను పాటించే కంపెనీలను మాత్రమే ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. యాంత్రీకరణ పథకంలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులకు అందాల్సిన సబ్సిడీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. మధ్యవర్తులకు అవకాశం లేకుండా రైతుకే నేరుగా ప్రయోజనం అందేలా వ్యవస్థను రూపొందించామన్నారు.



## హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు. పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## సీఎం సొంతూరులో కరెంట్ కట్!

**బాధాకరం: డిప్యూటీ సీఎం భట్టి**



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లి సమీపంలో కరెంట్ కోసం రైతులు ధర్నా చేయడం బాధాకరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో విద్యుత్ కోతలపై ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు భట్టి సమాధానం ఇస్తూ ఇలా స్పందించారు. సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లి సమీపంలో రైతులు అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ కరెంట్ కోసం ధర్నా చేశారు.. మీకు కనబడుత లేదా అని వారు వ్యంగ్యంగా అన్నారు.. యస్ నాకు కనబడుతుంది.. బాధగా కూడా ఉంది. అది రాష్ట్ర ప్రభుత్వ తప్పిదం వల్ల కాదు కదా.. మనం నిర్ణయాలు చేయలేకపోవడం వల్ల కాదు కదా.. ప్రకృతిలో సంభవించిన ఎల్‌నినో వల్ల. పసిఫిక్ మహాసముద్రంలో సంభవించిన వాతావరణ పరిస్థితుల వల్ల, వేడిగాలులు పెద్ద ఎత్తున లేచి రుతుపవనాలన్నింటిని దూరంగా నెట్టేస్తూ ఉంటే దీని ప్రభావం కేవలం తెలంగాణ, దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఉంది అని భట్టి విక్రమార్క బదులిచ్చారు. తెలంగాణలో ఏటా విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని భట్టి విక్రమార్క తెలిపారు. 2023లో 15 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండేదని, 2026 సెప్టెంబర్ 9 నాటికి 19 వేల మెగావాట్లకు డిమాండ్ పెరిగిందన్నారు. ఈ ఏడాది చివరినాటికి 20 వేల మెగావాట్లకు పైగా విద్యుత్ డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక వృద్ధి, ప్రజల వినియోగ శక్తి పెరగడం మూలంగా డిమాండ్ వేగంగా పెరుగుతోంది. అందుకే వినియోగానికి తగినట్లు విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. సౌర, ఫ్లోటింగ్ సోలార్, ఇతర సంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయి. దీనిపై త్వరలో స్పష్టంగా ప్రకటన చేస్తామని భట్టి పేర్కొన్నారు.

## జీహెచ్ఎంసీకి యాడ్ ఏజెన్సీల బాకీలు

**రూ. 39.74 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్టు వెల్లడి**




హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని అవుట్‌డోర్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు భారీగా బకాయిలు పడ్డాయి. ఈ ఏజెన్సీల నుంచి జీహెచ్ఎంసీకి సుమారు రూ. 39.74 కోట్లు (ఖచ్చితంగా రూ. 39,74,15,778) రావాల్సి ఉందని తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా, పురపాలక-పట్టణాభివృద్ధి శాఖ సెప్టెంబరు 10న శాసనమండలిలో ఈ వివరాలను సమర్పించింది. ప్రభుత్వం అందించిన నివేదిక ప్రకారం.. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో మొత్తం 452 ఏజెన్సీ ఎంట్రీలు, 1,521 అడ్వర్టైజ్‌మెంట్ యూనిట్లకు సంబంధించి ఈ బకాయిలు పేరుకుపోయాయి. బకాయిదారుల జాబితాలో పలు ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ముఖ్యంగా, యూనియాడ్స్ అనే సంస్థ ఒక్క యూనిట్‌కే అత్యధికంగా రూ. 7.71 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఐ క్యాచ్ కమ్యూనికేషన్స్ మరో యూనిట్‌కు సంబంధించి రూ. 6.47 కోట్లు బకాయిపడింది. అత్యధిక యూనిట్లు కలిగిన సంస్థల్లో ప్రకాశ్ ఆర్ట్స్ ముందు వరుసలో ఉంది. ఈ సంస్థకు చెందిన 53 యూనిట్లకు గానూ మొత్తం రూ. 5.35 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటితో పాటు మీడియా కార్ప్ రూ. 5.06 కోట్లు, సీఎంఎస్ఎస్ రూ. 1.79 కోట్లు, అవుట్‌స్పేస్ అడ్వర్టైజింగ్ రూ. 1.86 కోట్ల చొప్పున బకాయిలు చెల్లించాల్సి ఉంది. అవుట్‌డోర్ ప్రకటనల నియంత్రణ కోసం ప్రభుత్వం ఈ ఏడాది మార్చి, జూన్ నెలల్లో 'అవుట్‌డోర్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ ఫర్ క్యూర్-2026'ను జారీ చేసింది. దీని ప్రకారం.. ప్రైవేట్ ఆస్తులపై ప్రదర్శించే ప్రకటనలకు ఆన్‌లైన్ ద్వారా, ప్రభుత్వ ఆస్తులపై ప్రకటనలకు టెండర్ల ద్వారా అనుమతులు మంజూరు చేస్తారు. అయితే, ఫీజుల వసూలుకు సంబంధించి 2020 నాటి మార్గదర్శకాలు ప్రస్తుతం నిలిపివేతలో ఉన్నాయని, త్వరలోనే సమగ్రమైన కొత్త విధానాన్ని తీసుకురానున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

## 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి: రాంచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విప్లవంతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే 'మేరే సప్నో కా భారత్', 'సేవా కీ కహానీ', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, మోదీ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని పేర్కొన్నారు.

## జనసేన కార్యకర్తలను తొక్కేస్తున్నారు: బొలిశెట్టి

అంబేద్కర్ కోనసీమ జిల్లా, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. రామచంద్రపురం జనసేన విస్తృతస్థాయి సమావేశంలో టీడీపీపై ఆయన హాట్ కామెంట్స్ చేశారు. "జనసేన గెలిచిన చోట టీడీపీ వాళ్లను గౌరవించినా.. టీడీపీ గెలిచిన చోట జనసేన కార్యకర్తలను తొక్కుతున్నారు. ఈ విషయం మన నాయకుడు పవన్ కళ్యాణ్‌కు కూడా తెలుసు" అంటూ బొలిశెట్టి వ్యాఖ్యానించారు. బొలిశెట్టి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వాస్తవాన్నే నేను చెప్తా.. ఎవరికీ భయపడనంటూ బొలిశెట్టి తేల్చి చెప్పారు. బొలిశెట్టి కామెంట్స్‌పై టిడిపి వర్గాలు మండిపడుతున్నాయి.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



# దేశాభివృద్ధిలో ఎల్ఐసీ కీలక భాగస్వామి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): కోట్లాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు దేశ ఆర్థికాభివృద్ధిలో భారతీయ జీవిత బీమా సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్య జీవిత బీమా సలహాదారుల సంక్షేమ సంఘం అఖిల భారత ఉపాధ్యక్షుడు జి. సోమ నరసయ్య అన్నారు. బీమా ప్రతినిధుల్లో ఉత్సాహాన్ని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా రూపొందించిన ప్రత్యేక గీతం, ప్రచార పత్రాలను శుక్రవారం సికింద్రాబాద్ విభాగ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమ నరసయ్య మాట్లాడుతూ ఎల్ఐసీ కేవలం బీమా రక్షణ కల్పించే సంస్థ మాత్రమే కాకుండా దేశ నిర్మాణంలో తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్న ప్రజా సంస్థ అని అన్నారు. విద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు, ప్రభుత్వ మౌలిక వసతులు, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ వంటి జాతీయ ప్రాధాన్యతా రంగాలకు సంస్థ పెట్టుబడుల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తోందని తెలిపారు. సుమారు 14 లక్షల మంది ప్రతినిధులు, ఉద్యోగుల భాగస్వామ్యంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానించుకుని సంస్థ అగ్రస్థానంలో కొనసాగుతోందన్నారు. క్షేత్రస్థాయి ప్రతినిధులే సంస్థకు బలమని, వారి సమస్యల పరిష్కారం, వృత్తిపరమైన అభివృద్ధికి జాతీయ బీమా కార్మిక సంఘం చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. 'యోగక్షేమం వహామ్యహమ్' నినాదంతో సంస్థ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందన్నారు. సంఘం అఖిల భారత కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఎం. లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతినిధుల




మనోధైర్యాన్ని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో జాతీయ బీమా కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు టి. సూరికుమార్, కార్యదర్శి వీసీ వేణుమాధవ్, బీమా కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి సి.ఆర్.కె. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్.. 182 మందికి జరిమానా




వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 182 మందికి వేములవాడ కోర్టు జరిమానాలు విధించింది. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు వేములవాడ పట్టణ పోలీసులు నిర్వహించిన మద్యం సేవించి వాహనం నడిపే వారిపై తనిఖీల్లో పట్టుబడిన వారిని లోక్‌అదాలత్‌లో భాగంగా కోర్టులో హాజరుపరిచారు. కేసులను విచారించిన మేజిస్ట్రేట్ మేఘన నిందితులకు జరిమానాలు విధించారు. 52 మందికి ఒక్కొక్కరికి రూ. 4,000, 26 మందికి రూ. 5,000, 45 మందికి రూ. 3,000, 59 మందికి రూ. 2,000 చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ దిలీప్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి తమతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపిన కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని, పోలీసు ధ్రువీకరణ సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని తెలిపారు. రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా మద్యం సేవించి వాహనం నడిపే వారిపై తనిఖీలు, వాహన తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

# బావిలో తల్లి, కుమారుడి మృతదేహాలు

మల్యాల, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట శివారులో చోటుచేసుకున్న విషాద ఘటనలో తల్లి గుండేటి కవిత (34), ఆమె చిన్న కుమారుడు శశాంక్ (7) మృతిచెందారు. గురువారం కవిత మృతదేహాన్ని బావిలో నుంచి వెలికితీయగా, బాలుడి కోసం కొనసాగించిన గాలింపు చర్యల్లో శుక్రవారం తెల్లవారుజామున 4.10 గంటలకు రెస్క్యూ బృందం శశాంక్ మృతదేహాన్ని గుర్తించింది. గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది సహాయంతో బావిలో గాలింపు చేపట్టారు. బాలుడి మృతదేహం లభించడంతో గురువారం నుంచి కొనసాగుతున్న గాలింపు చర్యలకు ముగింపు లభించింది. తల్లి, కుమారుడి మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.



## రైతు సమస్యలపై
# బీజేపీ మహాధర్నా

చందుర్తి, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చందుర్తి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు మొకిలే విజయేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లాడి రమేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని విస్మరించిందని ఆరోపించారు. కనీసం ఆరు గంటల నాణ్యమైన విద్యుత్ కూడా అందడం లేదని విమర్శించారు. విద్యుత్ కోతలు, అరకొర సరఫరా కారణంగా పొట్ట దశలో ఉన్న పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకుని రైతులకు నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు మర్రి మల్లేశం, పేరుక గంగరాజు, సర్పంచ్ నరగుల గంగాస్వామి, ఉపసర్పంచ్ మైకల జేలేందర్, మోర్చా అధ్యక్షులు చింతకుంట సాగర్, మోత్కుపల్లి రాజశేఖర్, మండల కార్యదర్శులు బద్దం తిరుమల్‌రెడ్డి, అయోధ్య పరశురాములు, కోశాధికారి అజ్మీరా రవి, బూత్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మట్టి గణపతుల
# తయారీలో విద్యార్థుల ప్రతిభ

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): వేములవాడ కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతుల తయారీ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో ఎలాంటి రసాయన రంగులు ఉపయోగించకుండా సహజసిద్ధమైన బంకమట్టితో ఆకర్షణీయమైన వినాయక విగ్రహాలను తయారు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలు, మట్టి గణపతుల వల్ల కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ నరాల దేవేందర్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మట్టి గణపతిని పూజించడం ద్వారా ప్రకృతిని గౌరవించినట్లేనని అన్నారు. విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతులను ఇళ్లలో పూజించి, అనంతరం ఇంట్లోనే నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ధరక్షన్ వసూపియా విద్యార్థుల సృజనాత్మకతను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రాజన్న ఆలయానికి
# లాకర్ విరాళం

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వేములవాడ శాఖ సిబ్బంది సుమారు రూ. 45 వేల విలువైన లాకర్‌ను విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో ఆలయ ఈవో రమాదేవికి బ్యాంకు ప్రతినిధులు లాకర్‌ను లాంఛనంగా అప్పగించారు. ఆలయ అవసరాల కోసం లాకర్‌ను అందించిన బ్యాంకు అధికారులు, ఉద్యోగులకు ఈవో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్, అకౌంట్ అడ్వైజర్ ఆగమరావు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వేములవాడ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రావణ అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు

జగిత్యాల, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): శ్రావణ మాస అమావాస్యను పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు సమీపంలో ఉన్న శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, నారికేళాభిషేకం, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. పారాయణం అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం, ముడుపులు సమర్పించారు. అమ్మవారిని 51 చీరలతో అలంకరించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీడిప్ ద్వారా ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, తాంబూలాన్ని ఆలయ అర్చకుల ఆశీర్వచనాలతో భక్తులకు అందించారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు వొడ్నాల లత, వడ్లగట్ట స్వాతి, భారతాల గీత, సాయిరాణి, సంధ్య, భాగ్యలక్ష్మి, చంద్రకళ, అవంతిక, గంగమ్మ, పద్మావతి, సుజాత, దివ్య, శిరీష, అంజలి, మాధురి, జమున, మనీత, గంగాజలం, ప్రియాంక, సాయి ప్రసన్న, అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగుడికి బ్యాటరీ సైకిల్ అందజేత

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): సనత్‌నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన గడ్డం హరిప్రసాద్ ఇటీవల ప్రమాదంలో రెండు కాళ్లను కోల్పోయాడు. స్థానిక బీజేపీ నాయకుల విజ్ఞప్తికి స్పందించిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి సహకారంతో హరిప్రసాద్‌కు శుక్రవారం బ్యాటరీ సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ కుటుంబ సభ్యులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యను గుర్తించి సహాయం అందించేందుకు కృషి చేసిన బీజేపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ టి. రాజశేఖర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వై. సురేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎస్. రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. శ్రీనివాస్, నాయకులు ఎలకొండ శ్రీనివాస్ ముదిరాజ్, కే. కృష్ణ, కే.ఎం. కృష్ణ, అరుణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రామంచ మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి బంధం కిరణ్, భీమ్‌రావు, పరమేష్, గణేష్, శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా సురేశ్

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా వై. సురేష్‌కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు జి. భరత్‌గౌడ్ శుక్రవారం ఆయనకు నియామక పత్రం అందజేసి అభినందించారు. బీసీ కులాల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పోరాడాలని వారు సూచించారు. అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీతో పనిచేసి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌రామ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణ

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు): వినాయక చవితిని పురస్కరించుకుని వేములవాడ పీఎం శ్రీ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు మట్టి గణపతి విగ్రహాలను తయారు చేశారు. పాఠశాల పర్యావరణ క్లబ్ ఆధ్వర్యంలో బంకమట్టిని సేకరించి, శుద్ధి చేసి సుమారు 100 మట్టి వినాయక ప్రతిమలను తయారు చేశారు. అనంతరం విద్యార్థులు మేళతాళాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అర్బన్ తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ఎంఆర్సీ, మున్సిపల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, జూనియర్ కళాశాల తదితర ప్రాంతాలకు వెళ్లి అధికారులకు మట్టి గణపతి ప్రతిమలను అందజేశారు. పర్యావరణ క్లబ్ ఇన్‌చార్జి బొజ్జ కృష్ణ మాట్లాడుతూ పండుగలు, సంప్రదాయాలను పాటిస్తూనే ప్రకృతికి హాని కలగకుండా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించేందుకే మట్టి గణపతులను తయారు చేసి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బన్నాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.








## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి: బీజేపీ

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 11 (ఈవార్తలు):: సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వేములవాడ రూరల్ మండల తహసీల్దార్‌కు పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేసుకుంటూ ఆ రోజును తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని కోరారు. తెలంగాణ కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజా ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామ పంచాయతీల్లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల కుటుంబాలను సత్కరించాలని, పాఠశాలల్లో తెలంగాణ చరిత్రపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తోట శేఖర్, ఉపాధ్యక్షుడు లింగంపల్లి కుంటయ్య, గుంటి వంశీకృష్ణ, చిందం కుమార్, పోగుల రాకేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫాస్టాగ్ బ్యాంక్ ఖాతా మార్చొచ్చు!

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్యాగ్ యూజర్లకు శుభవార్త చెప్పింది. ఇకపై వాహనానికి ఉన్న ఫాస్ట్‌ట్యాగ్ స్టిక్కర్‌ను తొలగించి కొత్తది తీసుకోవాల్సిన అవసరం లేకుండానే.. బ్యాంకును మార్చుకునే అవకాశం కలగనుంది. దీనికోసం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వన్‌ట్యాగ్ (ాఅముఘ్ర) పేరుతో కొత్త పోర్టబిలిటీ వ్యవస్థను ప్రారంభించింది. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ఈ వ్యవస్థను ప్రారంభించారు. ఇదివరకు ఫాస్ట్‌ట్యాగ్ జారీ చేసిన బ్యాంకును మార్చుకోవాలంటే ముందుగా ఉన్న ఫాస్ట్‌ట్యాగ్ ఖాతాను క్లోజ్ చేసి.. కొత్తగా మరో ఫాస్ట్‌ట్యాగ్ తీసుకోవాల్సి ఉండేది. అయితే వన్‌ట్యాగ్ ద్వారా ఈ ప్రక్రియ మరింత సులభం కానుంది. వినియోగదారులు తమ వాహనానికి ఇప్పటికే ఉన్న ఫాస్ట్‌ట్యాగ్ కొనసాగిస్తూ, అదే ట్యాగ్ ఐడీ, వెహికల్ రిజిస్ట్రేషన్ నంబరరుతో మరో బ్యాంకుకు మారవచ్చు. అంటే కొత్త ఫాస్ట్‌ట్యాగ్ స్టిక్కర్‌ను వాహనంపై అతికించాల్సిన అవసరం ఉండదు. ఈ కొత్త విధానాన్ని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రోత్సహించే ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (×ఎవీజూ), నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (చీూజ×) సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఈ సదుపాయం ఎన్‌హెచ్‌ఏఐకి చెందిన రాజ్‌మార్గ్ యాత్ర మొబైల్ యాప్ ద్వారా అందుబాటులో ఉంటుంది. బ్యాంక్ మార్చుకోవాలనుకునే వినియోగదారులు ముందుగా ఎలిజిబిలిటీ చెక్ చేసుకుని, వెరిఫికేషన్ పూర్తి చేసి, తమ సమ్మతి తెలిపి, కొత్తగా కోరుకున్న బ్యాంక్ ఎంచుకోవాలి. ఆ తర్వాత కొత్త బ్యాంకుతో ఆన్ బోర్డింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. బ్యాంక్ మారిన తర్వాత పాత ఫాస్ట్‌ట్యాగ్‌కు సంబంధించిన బాధ్యతలు పూర్తిగా కొత్త బ్యాంకుకు వెంటనే వెళ్లవు. పాత బ్యాంకే కస్టమర్ వెరిఫికేషన్, పాత వాలెట్‌లోని రీఫండ్స్, పెండింగ్ లావాదేవీలు వంటి అంశాలను పరిష్కరించాల్సి ఉంటుంది. ఇవన్నీ పూర్తయిన తరువాత కొత్త బ్యాంక్ నుంచి లావాదేవీలు జరుగుతాయి.

## 21.57 లక్షల కోట్లకు భారత వాణిజ్య లోటు!

**చైనా, రష్యాల నుంచే అధికంగా నమోదు**

**భారత ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు కల్పించాలని డిమాండ్**

**ఫార్మా, ఆటోమొబైల్ రంగాల్లో అవకాశాలపై ప్రధానంగా చర్చ**

న్యూఢిల్లీ: భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో కూటమితో దేశానికి నానాటికీ పెరుగుతున్న వాణిజ్య లోటు అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. బ్రిక్స్ దేశాలతో (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) భారత్ వాణిజ్య లోటు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 226.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 21.57 లక్షల కోట్లు)కు చేరడం ఆందోళన కలిగిస్తోంది. గత ఐదేళ్లలో బ్రిక్స్ దేశాలతో భారత్ మొత్తం వాణిజ్యం రెట్టింపై సుమారు 417.5 బిలియన్ డాలర్లకు చేరినప్పటికీ, లోటు కూడా అదే స్థాయిలో పెరగడం గమనార్హం. గణాంకాలను పరిశీలిస్తే.. గత ఐదేళ్లలో బ్రిక్స్ దేశాలకు భారత్ ఎగుమతులు 48.8% వృద్ధితో 95.7 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, ఇదే సమయంలో దిగుమతులు ఏకంగా 131.8% పెరిగి 321.8 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ప్రస్తుతం భారతదేశ మొత్తం దిగుమతుల్లో 40% బ్రిక్స్ దేశాల నుంచే వస్తుండగా, మన ఎగుమతుల్లో కేవలం 22% మాత్రమే ఆ దేశాలకు వెళ్తున్నాయి. ఈ భారీ వాణిజ్య లోటుకు ప్రధానంగా చైనా, రష్యాలే కారణమవుతున్నాయి. మొత్తం లోటులో దాదాపు సగం చైనా నుంచే ఉండగా.. యంత్ర పరికరాలు, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక ముడిసరుకుల దిగుమతులే అధికంగా ఉన్నాయి. మరోవైపు రష్యా నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న ముడి చమురు భారత్ ఇంధన భద్రతకు మేలు చేస్తున్నప్పటికీ, వాణిజ్య లోటును గణనీయంగా పెంచుతోంది. ఈ వాణిజ్య అసమతుల్యతను కేవలం ప్రతికూల అంశంగా చూడలేమని, ఇది నిర్మాణాత్మక లోపాన్ని సూచిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బ్రిక్స్ దేశాలకు భారత్ ఒక ముఖ్యమైన కొనుగోలు మార్కెట్‌గా మారింది కానీ, ఆ దేశాలకు కీలక సరఫరాదారుగా మాత్రం మారలేకపోయింది. ఈ నేపథ్యంలో బ్రిక్స్ ఛైర్మన్‌షిప్ హోదాను భారత్ ఒక అవకాశంగా వినియోగించుకుంటోంది.

## ఐసీసీ నుంచి వైదొలగండి

**నాటో దేశాలకు అమెరికా సూచన**

వాషింగ్టన్: అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) నుంచి వైదొలగాలని అమెరికా తన నాటో మిత్రదేశాలను కోరింది. ఈ ఏడాది జులైలో బ్రసెల్స్‌లో 32 నాటో దేశాల రాయబారులతో రహస్యంగా నిర్వహించిన సమావేశంలో అమెరికా ఈ డిమాండ్‌ను తెరపైకి తెచ్చినట్లు తాజాగా వెల్లడైంది. అమెరికా రాయబారి మాథ్యూ జార్జ్ ఈ సమావేశంలో మాట్లాడుతూ, ఐసీసీ వల్ల మిత్రదేశాలకు ఎదురయ్యే ముప్పును విశ్లేషించాలని, ఆ సంస్థకు మద్దతును నిలిపివేయాలని కోరారు. ఐసీసీ చర్యలను విమర్శిస్తూ, ఈ ధోరణికి ముగింపు పలకాలని ఆయన సూచించారు. ఐసీసీ ప్రాధాన్యతను క్రమంగా తగ్గించేందుకు అమెరికా ప్రణాళికలు రచిస్తోందని, తమ ప్రతిపాదనకు ఏయే దేశాలు మద్దతుగా నిలుస్తాయనే విషయాన్ని వాషింగ్టన్ నిశితంగా గమనిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, అమెరికా పిలుపును ఫ్రాన్స్, నెదర్లాండ్స్ వంటి దేశాలు వ్యతిరేకించాయి. తాము ఐసీసీకి మద్దతుగా నిలుస్తామని ఆ దేశాలు బహిరంగంగానే ప్రకటించాయి. మరోవైపు, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ, ఐసీసీ మద్దతుదారులు అంతర్జాతీయ చట్టాలను దుర్వినియోగం చేస్తూ ఇతర దేశాల సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. తమ అధికార పరిధిని పరిమితం చేసే ప్రయత్నాలు జరిగితే తీవ్రంగా స్పందిస్తామని ఆయన హెచ్చరించారు. నరమేధం, యుద్ధ నేరాల వంటి తీవ్రమైన అంతర్జాతీయ నేరాలకు పాల్పడిన వ్యక్తులను విచారించేందుకు 2002లో ఐసీసీని స్థాపించారు. నాటో కూటమికి ఈ కోర్టులో నేరుగా సభ్యత్వం లేకపోయినప్పటికీ, అమెరికా, టర్కీ మినహా మిగిలిన అన్ని నాటో సభ్యదేశాలు ఇందులో భాగస్వాములుగా కొనసాగుతున్నాయి.



## ప్రపంచ ఆర్థికంలో ‘బ్రిక్స్’ భళా

**జీడీపీలో 40 శాతానికి పైగా బ్రిక్స్ వాటా**

**జీ7 వాటా 29 శాతమే: పుతిన్**




న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పైగా ఉందని చెప్పారు. జీ7 దేశాల వాటా 29 శాతమేనని తెలిపారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన ‘బ్రిక్స్ బిజినెస్ ఫోరం’లో పుతిన్ మాట్లాడారు. గత ఐదేళ్ల గణాంకాలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగానికి పైగా బ్రిక్స్ దేశాల నుంచే వచ్చిందన్నారు. అదే సమయంలో జీ7 దేశాల వాటా 18 శాతంగా ఉందని చెప్పారు. బ్రిక్స్ ఎదుగుదలను పాశ్చాత్య దేశాలు గమనిస్తున్నాయని పుతిన్ అన్నారు. తమ పోటీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ పోటీ కొన్ని సందర్భాల్లో అసహ్యకర స్థాయికి చేరుతోందని వ్యాఖ్యానించారు. బ్రిక్స్ దేశాల కోసం కొత్త పెట్టుబడి వేదికను ఏర్పాటు చేయాలని పుతిన్ ప్రతిపాదించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా దీనిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు సమీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. బ్రిక్స్ దేశాలకు భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయని పుతిన్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం లోతైన మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రష్యాపై 30 వేలకు పైగా ఆంక్షలు ఉన్నాయని పుతిన్ వెల్లడించారు. ప్రపంచం మార్పుల దశలో ఉందని చెప్పారు. ఈ మార్పులు మానవాళి భవిష్యత్తుకు అవసరమని పేర్కొన్నారు.

## విభేదాలను పరిష్కరించుకుంటాం: చైనా



బీజింగ్: ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీకి ముందు బీజింగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, చైనా మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా స్పష్టం చేసింది. ఇరు దేశాలు మంచి పొరుగుదేశాలుగా, స్నేహపూర్వకంగా కలిసి పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. భారత్‌లో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ సమావేశం కానున్నారు. 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ తర్వాత సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2024 అక్టోబర్‌లో భారత్, చైనా సరిహద్దుల్లో గస్తీకి సంబంధించి కీలక ఒప్పందానికి వచ్చాయి. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ క్రమంగా మెరుగుపడుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో ప్రధాని మోదీ చైనాలో పర్యటించారు. ఆ తర్వాత ఉన్నతస్థాయి సంప్రదింపులు మరింత పెరిగాయి. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. ఇరు దేశాల నేతల మార్గదర్శకత్వంలో వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో సంబంధాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పరస్పరం సంప్రదింపులు పెంచడం, సహకారాన్ని బలోపేతం చేయడం, విభేదాలను సరిగా నిర్వహించడం తమ లక్ష్యాలని తెలిపారు.

## కాశ్మీరీలను జైలుకు పంపిస్తారా?

**కాంగ్రెస్‌పై కాశ్మీర్ సీఎం ఫైర్**




శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్‌లో వందేమాతరం గేయం ఆలపించే విషయంపై రాజకీయ వివాదం నడుస్తోంది. ఈ గేయాన్ని పూర్తిగా ఆలపించబోమని కాంగ్రెస్ చెబుతుంటే.. తాము మాత్రం మొత్తం గేయాన్ని ఆలపిస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ (ఎన్సీపీ) ప్రకటించింది. జమ్మూ కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ కూటమిలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఉంది. కూటమి ప్రభుత్వంగా ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ వైఖరిని ఎన్సీపీని తప్పుబట్టింది. ఈ మేరకు సీఎం ఒమర్ అబ్దుల్లా కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. తాజాగా జమ్మూ కాశ్మీర్‌లో అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ ప్రారంభ వేడుకల సందర్భంగా జాతీయ గీత జనగణమనతోపాటు జాతీయ గేయం వందేమాతరం కూడా ప్లే చేశారు. ఈ రెండూ ప్లే చేసేటప్పుడు జమ్మూ కాశ్మీర్ ఎల్జీ, సీఎం, ఇతర నేతలు నిలబడి ఉన్నారు. అయితే, పూర్తి గేయం ప్లే చేయడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తాము ఈ గేయాన్ని పూర్తిగా ఆలపించబోమని, రెండు చరణాలు మాత్రమే పాడుతామని కాంగ్రెస్ చెప్పింది. అయితే, సీఎం ఒమర్ అబ్దుల్లా మాత్రం కాంగ్రెస్ వైఖరిపై మండిపడ్డారు. శుక్రవారం ఈ అంశంపై మాట్లాడారు. వందేమాతరం గేయం పాడాలంటూ చట్టం చేసేటప్పుడే పార్లమెంట్‌లోనే కాంగ్రెస్ అడ్డుకోవాల్సింది. ఇప్పుడు ఇది చట్టంగా మారింది. దీని ప్రకారం మొత్తం గేయం పాడాలి. అలా పాడకుంటే అది నేరమే. ఈ చట్టం దేశమంతా వర్తిస్తుంది. ప్రభుత్వాలు దీన్ని అమలు చేయకుండా తప్పించుకోకూడదు. ఈ చట్టం ప్రకారం వందేమాతరంలోని అన్ని గేయాలు పూర్తిగా ఆలపించాల్సిందే. ఈ విషయంలో కాంగ్రెస్ అభ్యంతరం ఏంటి..? వందేమాతరం ఆలపించకుండా కాశ్మీర్ ప్రజలు జైలులో ఉండాలని కాంగ్రెస్ భావిస్తోందా..? ఇది చట్టపరమైన బాధ్యత. కావాలనుకుంటే కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రావాలి. ఆ తర్వాత వారు ఈ చట్టాన్ని రద్దు చేయొచ్చు.. అంటూ ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. తమ పార్టీ సిద్ధాంతాలకు, వందేమాతరం గేయానికి సంబంధం లేదన్నారు. ఇది చట్టం అని, అందువల్లే పాటిస్తున్నామన్నారు. కూటమిలో ఉన్నంత మాత్రాన కాంగ్రెస్ పార్టీ తమపై ఒత్తిడి తేలేదని ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు.

## కాళీఘాట్‌లో సువేందు ‘మాంసాహార ప్రసాదం’

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఆహారపు అలవాట్లు, మతపరమైన విశ్వాసాల చుట్టూ తిరిగిన వివాదం కొత్త మలుపు తిరిగింది. దుర్గాపూజ, నవరాత్రుల సమయంలో బెంగాలీ హిందువులు మాంసాహారం



విక్రయించకూడదని, తినకూడదని బాగేశ్వర్ ధామ్ పీఠాధిపతి ధీరేంద్ర కృష్ణ శాస్త్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో తీవ్ర దుమారాన్ని రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలను బెంగాలీ ప్రజలు, సాంస్కృతిక వర్గాలు తమ సంప్రదాయంపై దాడిగా భావించగా... బీజేపీకి చెందిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి అత్యంత వ్యూహాత్మకంగా, బెంగాలీ శైలిలోనే సమాధానం ఇచ్చారు. కౌశికి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని కోల్‌కతాలోని ప్రసిద్ధ, శతాబ్దాల చరిత్ర కలిగిన కాళీఘాట్ ఆలయాన్ని సువేందు అధికారి దర్శించుకున్నారు. ఆలయంలో కాళీమాతకు నైవేద్యంగా సమర్పించిన ప్రసిద్ధ ‘భోగ్’ (చేప తల, ఫ్రైడ్ ఫిష్, బాసంతి పులావ్)ను ఆయన కింద కూర్చుని ఎంతో తృప్తిగా స్వీకరించారు. ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పశ్చిమ బెంగాల్ సంస్కృతిని, సంప్రదాయాలను గౌరవించడంలో తమ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని ప్రతీకాత్మకంగా నిరూపించారు. వివాదం వివరాల్లోకి వెళితే... నవరాత్రుల్లో నాన్-వెజ్ తినేవారిని ‘పాఖండీ’ (పాపి/కపటి) అని అభివర్ణిస్తూ దుర్గాపూజ సమయంలో మాంసం, మద్యం షాపులు మూసివేయాలని బాగేశ్వర్ బాబా పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన బెంగాల్ బీజేపీ నాయకత్వం... ఏ ఆధ్యాత్మికవేత్త కూడా ప్రజల ఆహారపు అలవాట్లను శాసించలేరని, శాక్తేయ సంప్రదాయం ఉన్న బెంగాల్‌లో అమ్మవారికి మేక మాంసం, చేపలు నైవేద్యంగా పెట్టడం ఆనవాయితీ అని స్పష్టం చేసింది. “నేను సనాతన హిందువుని.. మహాష్టమి రోజున సాత్విక ఆహారం తీసుకుంటాను, కాళీమాతకు సమర్పించిన ప్రసాదంగా మేక మాంసం, చేపలు స్వీకరిస్తాను” అని సువేందు పేర్కొంటూ, ఎవరి నమ్మకాలు వారివని బాబా వ్యాఖ్యలను దాటవేశారు. భారతదేశంలో ఇతర ప్రాంతాలలో ఆలయ ప్రాంగణంలో నాన్-వెజ్ తింటే వివాదాలు చెలరేగుతాయి కానీ, బెంగాలీ శాక్తేయ సంప్రదాయంలో చేపలు, మాంసం ప్రసాదంగా స్వీకరించడం అనేది శతాబ్దాలుగా వస్తున్న ఆచారం. ఉత్తరాది సంస్కృతిని బెంగాల్‌పై రుద్దుతున్నారన్న విమర్శలను పటాపంచలు చేస్తూ, ప్రాంతీయ సెంటిమెంట్‌ను బీజేపీ గౌరవిస్తుందని స్పష్టం చేసేందుకే సువేందు ఈ భోగ్ స్వీకరించారనే విశ్లేషణలు వస్తున్నాయి.

## చిన్మయ్ కృష్ణదాస్‌కు 5 గంటల పెరోల్

**తల్లి అంత్యక్రియలకు మాత్రమే అనుమతి**



ఢాకా: బంగ్లాదేశ్‌లో దేశద్రోహం ఆరోపణలపై జైలులో ఉన్న హిందూ సన్యాసి చిన్మయ్ కృష్ణ దాస్‌కు అధికారులు ఐదు గంటల పాటు పెరోల్ మంజూరు చేశారు. అనారోగ్యంతో మరణించిన తన తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆయనకు ఈ వెసులుబాటు కల్పించారు. బతికున్నప్పుడు తనను చూడాలన్న తల్లి చివరి కోరిక తీరకపోవడం, కనీసం అంత్యక్రియలకైనా కుమారుడు హాజరుకావడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళితే.. బంగ్లాదేశ్ సమ్మిళిత సనాతని జాగరణ్ జోట్ అధికార ప్రతినిధి అయిన చిన్మయ్ కృష్ణ దాస్‌ను 2024 నవంబర్‌లో దేశద్రోహం కేసులో అరెస్టు చేశారు. జాతీయ జెండాను అగౌరవపరిచారనేది ఆయనపై ఉన్న ప్రధాన ఆరోపణ. అప్పటి నుంచి ఆయన జైలులోనే ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన తల్లి సంధ్యా రాణి ధర్ (71) క్యాన్సర్‌తో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో ఛటోగ్రామ్‌లోని హథాజారి ఆశ్రమంలో గురువారం కన్నుమూశారు. ఆమె బతికి ఉన్నప్పుడు తన కుమారుడిని చూడాలని ఆశపడ్డారు. దీనికోసం ఆయన కుటుంబ సభ్యులు పెరోల్‌కు దరఖాస్తు చేసినప్పటికీ, అనారోగ్యంతో ఉన్న బంధువును చూసేందుకు ఖైదీని విడుదల చేసే నిబంధన లేదని అధికారులు తిరస్కరించారు. ఆమె మరణం తర్వాత ఛటోగ్రామ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ జహిదుల్ ఇస్లాం మియా మానవతా దృక్పథంతో స్పందించారు. తల్లి అంత్యక్రియల కోసం చిన్మయ్ కృష్ణ దాస్‌కు ఐదు గంటల పెరోల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. పెరోల్‌పై బయటకు వచ్చిన చిన్మయ్ దాస్, పుండరీక్ ధామ్ ఆలయంలో రాధాకృష్ణ విగ్రహం పాదాలను తాకి కన్నీటిపర్యంతమైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. చిన్మయ్ దాస్‌పై దేశద్రోహం కేసుతో పాటు తన అరెస్టుకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో ప్రభుత్వ ప్రాసిక్యూటర్ మరణానికి సంబంధించిన హత్య కేసు కూడా నమోదైంది. కొన్ని కేసుల్లో బెయిల్ లభించినప్పటికీ, ఇతర కేసులు పెండింగ్‌లో ఉండటంతో ఆయన జైలులోనే కొనసాగుతున్నారు. తల్లి అంత్యక్రియలు పూర్తి చేసిన అనంతరం, గడువు ముగియగానే ఆయన తిరిగి ఛటోగ్రామ్ సెంట్రల్ జైలుకు వెళ్లారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీల హక్కుల కోసం పనిచేసే ఆయనకు పరిమిత కాలం పెరోల్ లభించడం చర్చనీయాంశంగా మారింది.

## ఏఐతో ఉగ్ర ప్రచారం

**భారత్‌లో యువతకు ఐసిస్ గాలం**

**మహిళలు, చిన్నారులే లక్ష్యంగా కార్యకలాపాలు**

న్యూఢిల్లీ: ఐసిస్, అల్-ఖైదా వంటి భయానక ఉగ్రవాద సంస్థలు తమ పంథాను పూర్తిగా మార్చుకున్నాయి. భౌతిక దాడుల స్థానంలో భావజాల వ్యాప్తి, రాడికలైజేషన్‌ను ప్రధాన అస్త్రంగా ఎంచుకున్నాయి. ఈ ప్రమాదకర వ్యూహాన్ని అమలు చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నాయని ఐక్యరాజ్యసమితి నివేదిక హెచ్చరించింది. ముఖ్యంగా భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా మహిళలు, చిన్నారులను లక్ష్యంగా చేసుకుని వారిని తీవ్రవాద భావజాలం వైపు ఆకర్షిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఐక్యరాజ్యసమితికి చెందిన ‘కౌంటర్-టెర్రరిజం కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరేట్’ (సీటీఈడీ) విడుదల చేసిన తాజా నివేదికలో ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఉగ్రవాద సంస్థలు ఏఐ, ముఖ్యంగా జెనరేటివ్ ఏఐ సహాయంతో వివిధ వర్గాలకు అనుగుణంగా ప్రచార కంటెంట్‌ను వేగంగా రూపొందిస్తున్నాయని తెలిపింది. పురుషులు, మహిళలు, యువతులు, యువకులు, చిన్నారులు.. ఇలా ప్రతి ఒక్కరి మానసిక స్థితికి తగ్గట్టుగా సందేశాలను తయారుచేసి, వాటిని వేగంగా వ్యాప్తి చేస్తున్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి చోటా ఇస్లామిక్ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతోనే ఈ ప్రచారాన్ని ఉద్ధృతం చేశాయని వివరించింది. భారత ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు కూడా ఈ పరిణామాలను ధ్రువీకరిస్తున్నారు. భారత్‌లో ఐసిస్, అల్-ఖైదా సంస్థలు ఏఐని ఉపయోగించి మహిళలు, చిన్నారులను ప్రత్యేకంగా లక్ష్యం చేసుకున్నాయని ఓ అధికారి తెలిపారు. చిన్న వయసులోనే పిల్లల బలహీనతలను ఆసరాగా చేసుకుని, వారిలో తీవ్రవాద భావజాలాన్ని నింపి భవిష్యత్తుకు సిద్ధం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మాయిలను, యువతులను ఆకర్షించేందుకు రక్షణ, గుర్తింపు వంటి అంశాలను వాడుకుంటుండగా.. అబ్బాయిలను హింస ద్వారానే శక్తి, గౌరవం లభిస్తాయనే పద్ధతిలో రెచ్చగొడుతున్నారని ఐరాస నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ఈ ఏఐ ఆధారిత ప్రచార నమూనాను ఐసిస్ విజయవంతంగా ఉపయోగిస్తోందని, నిఘా వర్గాలు గుర్తించాయి. ఇలా భావజాల వ్యాప్తికి గురైన వారు నేరుగా దాడులకు పాల్పడకుండా నిశ్శబ్దంగా తమ పనిని చేసుకుపోతుండటంతో వీరిని గుర్తించడం కష్టంగా మారుతోందని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఇతర ఉగ్రవాద సంస్థలు కూడా ఇదే పంథాను అనుసరించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## వయ్యారి చిత్రం



# టాక్సిక్‌కు 300 కోట్ల లాస్?



కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కిన భారీ బడ్జెట్ చిత్రం 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించారు. ఈ మూవీ భారీ అంచనాలతో రిలీజైంది. దానికి తగ్గట్టుగానే బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్ సాధించింది. అయితే ఆ జోరు ఒక్కరోజుకే పరిమితమైంది. ప్రస్తుతం థియేట్రికల్ రన్ ముగింపు దశకు చేరుకోవడంతో ఈ సినిమా కలెక్షన్లు ఎంత రాబెట్టిందని ప్రస్తుతం అనే చర్చ జరుగుతోంది. ఆగస్టు 26న థియేటర్లలో విడుదలైన 'టాక్సిక్' తొలి రోజే ఇండియాలో రూ.101 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాల అంచనా. ప్రపంచవ్యాప్తంగా తొలి రోజు రూ.145 కోట్ల గ్రాస్ రాబట్టినట్లు తెలుస్తోంది. రెండో రోజు ఇండియాలో కేవలం రూ.37 కోట్ల నెట్ మాత్రమే వచ్చినట్లు ట్రేడ్ లెక్కలు చెబుతున్నాయి. సెప్టెంబర్ 10 నాటికి 'టాక్సిక్' ఇండియాలో రూ.247 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు అంచనా. ప్రపంచవ్యాప్తంగా సినిమా గ్రాస్ కలెక్షన్స్ దాదాపు రూ.339 కోట్లుగా ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'టాక్సిక్' సినిమా నిర్మాణానికి రూ.500 కోట్లకు పైగే ఖర్చుయిందనే వార్తలు వచ్చాయి. కనీసం రూ.500 కోట్ల బడ్జెట్‌ను పరిగణనలోకి తీసుకున్నా.. ప్రస్తుత నెట్ వసూళ్లతో పోలిస్తే భారీగానే నష్టాలు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' కూడా భారీ బడ్జెట్‌తో తెరకెక్కి ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించలేకపోయిన విషయం తెలిసిందే. ఇప్పుడు 'టాక్సిక్'కు సంబంధించిన ప్రస్తుత ట్రేడ్ అంచనాలను పరిశీలిస్తే.. నష్టాల పరంగా 'ఆదిపురుష్'ను కూడా అధిగమించినట్లు తెలుస్తోంది.

# సరికొత్తగా.. జీ5!



భారతీయ వినోద రంగంలో సరికొత్త శకానికి తెరలేచింది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం జీ5 తన ప్లాట్‌ఫారమ్‌ను అత్యంత ఆధునిక సాంకేతికతతో, సరికొత్త బ్రాండ్ ఐడెంటిటీతో పూర్తిగా మార్చివేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా, ప్రేక్షకుల అభిరుచులకు తగినట్లుగా మొబైల్ మరియు కనెక్టెడ్ టీవీ వినియోగదారుల కోసం జీ5 సరికొత్త ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. వినోదాన్ని వెతకడం నుంచి చూడటం వరకు ప్రతి క్షణాన్ని లీనమయ్యేలా చేసేందుకు ఏఐ టెక్నాలజీని పెద్దఎత్తున జోడించారు. ప్రేక్షకులు తమకు నచ్చిన కంటెంట్‌ను క్షణాల్లో వెతుక్కునేందుకు వీలుగా ఏఐ ఆధారిత పర్సనలైజేషన్‌ను జీ5 తీసుకువచ్చింది. మొబైల్ నుంచి పెద్ద తెరపైకి (టీవీకి) మారినప్పుడు ఎలాంటి అంతరాయం కలగకుండా క్రాస్-స్క్రీన్ ఎక్స్‌పీరియన్స్‌ను రూపొందించారు. అలాగే సబ్‌స్క్రిప్షన్లు, ప్లేబ్యాక్ మరియు పరికరాలకు సంబంధించిన సమస్యలను ఇట్టే పరిష్కరించేందుకు నెక్స్ట్-జనరేషన్ ఏఐ కస్టమర్ అసిస్టెంట్‌ను పరిచయం చేశారు. యూజర్ల గోప్యతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కేటగిరీ-లీడింగ్ డేటా ప్రైవసీ ఫీచర్లను ఇందులో పొందుపరిచారు.

## 18న తెలుగులో హనుమాన్ అంశ్!




ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవితాధారంగా తెరకెక్కిన సంచలన హిందీ భక్తిరస చిత్రం 'హనుమాన్ అంశ్' ఇప్పుడు అధికారికంగా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఎలాంటి భారీ అంచనాలు లేకుండా కేవలం రూ.2 కోట్ల చిన్న బడ్జెట్‌తో విడుదలై, బాక్సాఫీస్ వద్ద వంద కోట్ల రూపాయలకు పైగా వసూళ్లతో అఖండ విజయాన్ని సొంతం చేసుకున్న ఈ చిత్రాన్ని తెలుగులో గ్రాండ్ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని తెలుగులో సమర్పిస్తుండగా, ఫార్చున్ ఫోర్ సినిమాస్ సంస్థ తెలుగు థియేట్రికల్ విడుదలను చేపట్టింది. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శోభినావ్ సత్య, విహాన్ శెడ్గే ప్రధాన పాత్రల్లో నటించారు. నీమ్ కరోలి బాబా భక్తుల భావోద్వేగాలను, ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను కూడా ఎంతగానో ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

## ఇరుముడి నాకు ప్రత్యేకం: రవితేజ



మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం హైదరాబాద్‌లో 'జనరేషనల్ బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్' పేరుతో విజయోత్సవ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రవితేజ మాట్లాడుతూ, ఈ చిత్రం తనకు ఒక నటుడిగా ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టిందని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ.. "నా సినీ ప్రయాణంలో ఎన్నో విజయాలు, పరాజయాలు చూశాను. కానీ ఒక కళాకారుడిగా సమాజంలో నాకు లభించిన గౌరవానికి 'ఇరుముడి' ప్రత్యేక కారణమైంది. బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఒక ఎత్తయితే, నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని, అపారమైన గౌరవాన్ని సంపాదించుకోవడం మరో ఎత్తు. ఈ సినిమా నాకు ఆ అనుభూతిని ఇచ్చింది. డిస్ట్రిబ్యూటర్ల ముఖాల్లో కనిపించిన సంతృప్తి నాలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది" అని అన్నారు.



## ఇంటెన్స్ లవ్ స్టోరీ చేయాలనుంది

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు.

## ఆదర్శ కుటుంబం టీజర్‌కు నేడే ముహూర్తం!

టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ సోషల్ మీడియాలో కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను శనివారం మధ్యాహ్నం 12:00 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. "నువ్వు నాకు నచ్చావ్", "మల్లీశ్వరి" వంటి క్లాసిక్ ఫ్యామిలీ హిట్స్ అందించిన త్రివిక్రమ్ మాటలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఈ సినిమాపై సినీ వర్గాల్లోనూ, అభిమానుల్లోనూ విపరీతమైన క్రేజ్ ఉంది.




## స్టార్ హీరోయిన్ పాత్రలో తృప్తి



సందీప్ వంగా డైరెక్షన్‌లో రూపొందిన యానిమల్ మూవీతో బాలీవుడ్‌లో పాపులర్ అయ్యింది త్రిప్తి డిమ్రి. గ్లామర్ పాత్రలో తన అందాల ప్రదర్శనతో ఆకట్టుకున్నఈ సుందరి ఓవర్‌నైట్‌లో స్టార్‌గా మారింది. యానిమల్‌తో హీరోయిన్‌గా నటించిన రష్మిక మందన్న కంటే త్రిప్తి డిమ్రికే ఎక్కువ పేరొచ్చింది. యానిమల్ తర్వాత బాలీవుడ్‌లో చాలానే సినిమాలు చేసింది. ఆ స్థాయి హిట్టు మాత్రం దక్కలేదు. గ్లామర్ పాత్రలు అంతగా కలిసిరాకపోవడంతో తన రూట్ మార్చింది. తొలిసారి ఓ బయోపిక్ సినిమాను అంగీకరించింది. అలనాటి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ మీనా కుమారి జీవితం ఆధారంగా డైరెక్టర్ సిద్ధార్థ్ పి మల్హోత్రా ఓ సినిమాను తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమాకు కమల్ ఔర్ మీనా అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాలో మీనా కుమారి పాత్ర కోసం తొలుత అలియాభట్, శ్రద్ధాకపూర్, దీపికా పడుకోణ్‌తో పాటు చాలా మంది స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించాయి. చివరకు ఈ అవకాశం త్రిప్తి డిమ్రిని వరించింది. ఇటీవలే హీరోయిన్‌గా ఈ బోల్డ్ బ్యూటీని డైరెక్టర్ ఫైనల్ చేసినట్లు సమాచారం.



# షేర్లపై ధోనీకి ఆసక్తి లేదు

భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్ భవితవ్యంపై అనిశ్చితి కొనసాగుతుండగా.. తదుపరి చెన్నై సూపర్ కింగ్స్ కోచ్ అతడేనా? అనే ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. ఈ ఉత్కంఠ కొనసాగుతుండగానే ధోనీ ఫ్రాంచైజీలో వాటా కొన్నాడనే వార్తలు ఇటీవల వైరలయ్యాయి.

దాంతో ఈ విషయంపై ఫ్రాంచైజీ స్పందించింది. అసలు ధోనీకి తమను ఈ విషయం అడగలేదని, అతడికి ఆసక్తి కూడా లేదని వెల్లడించింది సీఎస్కే. అయితే.. మహీ భాయ్ మాత్రం వాటా కొనాలని భావించినట్టు కొన్ని కథనాలు చెబుతున్నాయి.

ఐపీఎల్‌లోనూ సారథిగా చెరగని ముద్ర వేసిన మహేంద్ర సింగ్ ధోనీ సీఎస్కేలో వాటా కొన్నాడనే వార్తలు చర్చనీయాంశంగా మారాయి. ఆరంభ సీజన్ నుంచి చెన్నై జట్టుకు కొండంత ఆస్తిలా మారిన ధోనీకి ఫ్రాంచైజీలో వాటా ఉందని కథనాలు రాగా యాజమాన్యం మాత్రం అదేం లేదంటోంది. ఫ్రాంచైజీలో వాటా కావాలని ధోనీ ఎప్పుడూ అడగలేదు. ఈ విషయాన్ని మేము చర్చించలేదు. వాటా అంశంపై యజమాని ఎన్ శ్రీనివాసన్‌తో ధోనీ మాట్లాడినట్టు కూడా మాకు తెలియదు అని సీఎస్కే అధికారి ఒకరు మీడియాతో అన్నారు. కానీ, ఆయన చెబుతున్నది అవాస్తమని, సీఎస్కే షేర్లు ధోనీ కొన్నాడని కొన్ని కథనాలు స్పష్టం చేస్తున్నాయి. చెన్నై సూపర్ కింగ్స్ షేర్లను అమ్మకానికి పెట్టినప్పుడు ధోనీ కొన్నాడట. అయితే.. బహిరంగ మార్కెట్లో మాత్రం ఫ్రాంచైజీ తమ షేర్లను విక్రయించలేదు. మరి.. అలాంటప్పుడు తాలా ఎలా కొన్ని షేర్లను కొన్నాడు? అనే సందేహం వస్తుంది అందరికి. మార్కెట్ జాబితాలో సీఎస్కే కంపెనీ రిజిస్టర్ కానందున.. ప్రైవేట్‌గా ధోనీ వీటిని కొన్నట్టు సమాచారం.



# కౌంటీల్లో కుల్దీప్ మాయ

టీమిండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, ఇంగ్లండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. యార్క్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ చైనామన్ బౌలర్, ఎసెక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ రాణించి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. నిలకడగా అవకాశాలు దక్కని ప్రస్తుత తరుణంలో ఈ ప్రదర్శన టీమిండియా యాజమాన్యానికి, ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు గట్టి సందేశం పంపినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఎసెక్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో యార్క్‌షైర్ తరఫున బరిలోకి దిగిన కుల్దీప్ యాదవ్ ఆద్యంతం ఆధిపత్యం చెలాయించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో మరింత చెలరేగి 50 పరుగులకే 6 వికెట్లు పడగొట్టాడు. దీంతో మ్యాచ్ మొత్తంలో 120 పరుగులకు 10 వికెట్లు సాధించిన ఘనతను అందుకున్నాడు. అంతకుముందు బ్యాటింగ్‌లోనూ కీలకమైన 36 పరుగులు చేసి జట్టు స్కోరు 390కి చేరడంలో తన వంతు పాత్ర పోషించాడు. ఎసెక్స్ తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ అయింది.



# ద్రవిడ్ మద్దతు చాలా గొప్పది: విక్రమ్ రాథోడ్

భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ సాధారణంగా కోచ్‌గా కనిపిస్తారు. కానీ యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ (ఈటీపీఎల్)లో ఆయన కొత్త పాత్రలో కనిపిస్తున్నారు. డబ్లిన్ గార్డియన్స్ ఫ్రాంచైజీ యజమానిగా వ్యవహరిస్తున్నారు. అయితే జట్టు తొలి ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం కూడా సాధించలేదు. అయినా ద్రవిడ్ ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదని ఆ జట్టు కోచ్ విక్రమ్ రాథోడ్ తెలిపారు. టీమిండియా, ఐపీఎల్‌లో ద్రవిడ్‌తో కలిసి పనిచేసిన రాథోడ్‌కు ఆయన్ను యజమాని పాత్రలో చూడటం కొత్త అనుభవం. "రాహుల్ యజమానిలా వ్యవహరిస్తున్నారు. పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. తొలి దశలో మేం ఐదు మ్యాచ్‌లు ఆడినా ఒక్కటి కూడా గెలవలేదు. అయినా ఆయన పూర్తిగా మాకు మద్దతుగా నిలిచారు" అని రాథోడ్ చెప్పారు. కోచ్‌గా జట్లపై ఎలాంటి ఒత్తిడి ఉంటుందో ద్రవిడ్‌కు బాగా తెలుసని అన్నారు. ఫలితాలు అనుకున్నట్లు రాకపోయినా ఎలా స్పందించాలో ఆయనకు అవగాహన ఉందన్నారు. డబ్లిన్ గార్డియన్స్‌లో రవిచంద్రన్ అశ్విన్ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని రాథోడ్ వెల్లడించారు. ప్రత్యర్థులపై వ్యూహాలు, జట్టు ఎంపిక వంటి రోజువారీ క్రికెట్ వ్యవహారాలను ప్రధానంగా అశ్విన్ చూసుకుంటున్నారని తెలిపారు. అశ్విన్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆటగాళ్లపై అపారమైన అవగాహన ఉందని రాథోడ్ చెప్పారు. "అతడిని క్రికెట్ అభిమాని అని పిలుస్తాను. ప్రపంచవ్యాప్తంగా ఎంతమంది ఆటగాళ్లను, ఎన్ని మ్యాచ్‌లను గమనిస్తాడో ఆశ్చర్యంగా ఉంటుంది" అని పేర్కొన్నారు. భారత క్రికెట్‌లోనే ఎక్కువ కాలం పనిచేసిన తనకు ఈటీపీఎల్ కొత్త అనుభవమని రాథోడ్ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అశ్విన్ జట్టులో ఉండటం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. స్థానిక పరిస్థితులు, ఆటగాళ్ల సామర్థ్యంపై అశ్విన్‌కు ఉన్న అవగాహన తన పనిని మరింత సులభం చేసిందని చెప్పారు.

# స్పోర్ట్స్ సైన్స్ హెడ్ పోస్టుకు బీసీసీఐ దరఖాస్తులు



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మరో కీలక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లో 'హెడ్-స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్' పదవికి మళ్లీ దరఖాస్తులు కోరుతోంది. ఈ పోస్టును గతేడాది సెప్టెంబర్‌లోనూ భర్తీ చేసేందుకు ప్రయత్నించినా.. సరైన అభ్యర్థి దొరకకపోవడంతో ప్రక్రియ పూర్తికాలేదు. ఈ పదవి 2025 మార్చి తర్వాత ఖాళీగా ఉంది. దాదాపు మూడేళ్లు సీవోఈలో సేవలందించిన మాజీ టీమిండియా ఫిజియో నితిన్ పటేల్ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ఈ ఖాళీ ఏర్పడింది. 2023 వన్డే ప్రపంచకప్ ముందు జస్‌ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, మహ్మద్ షమీల రికవరీలో పటేల్ కీలక పాత్ర పోషించారు. కొత్తగా ఎంపికయ్యే వ్యక్తి బీసీసీఐ స్పోర్ట్స్ సైన్స్, మెడిసిన్ విభాగానికి వ్యూహాత్మక, నిర్వహణపరమైన నాయకత్వం వహించాలి. జాతీయ జట్టు ఫిజియోలు, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ నిపుణులతో పాటు సీవోఈలోని వైద్య సిబ్బందిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆటగాళ్ల గాయాల నివారణ, చికిత్స, పునరావాసం, ఫిట్‌నెస్, శారీరక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. కొత్త వైద్య విధానాలు, పరిశోధనలు, సాంకేతికతను ఉపయోగించడం కూడా ఈ పోస్టులో కీలక బాధ్యతలుగా బీసీసీఐ పేర్కొంది. ఆటగాళ్ల ఆరోగ్యం, దీర్ఘకాలిక ఫిట్‌నెస్, గాయాల ముప్పు తగ్గించడం వంటి అంశాలపై వ్యూహాలను రూపొందించాల్సి ఉంటుంది. ఈ పోస్టుకు స్పోర్ట్స్ సైన్స్ లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ తప్పనిసరి. డాక్టరేట్ ఉంటే అదనపు అర్హతగా పరిగణిస్తారు. ప్రొఫెషనల్ లేదా ఒలింపిక్ క్రీడల్లో బృందాలకు నాయకత్వం వహించిన కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థి వయసు 60 ఏళ్లలోపు ఉండాలి. ఎంపికైన వ్యక్తి సీవోఈలో హెడ్ ఆఫ్ క్రికెట్‌గా ఉన్న మాజీ భారత బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు సెప్టెంబర్ 30 సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులను వ్యక్తిగత ఇంటర్వ్యూకు పిలుస్తారు.



# వినేశ్ ఫొగాట్‌కు షాక్

రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. 2026 సీనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్ సెలెక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు ఆమెకు అనుమతి ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. సెప్టెంబర్ 14న జరగనున్న సెలెక్షన్ ట్రయల్స్‌కు హాజరయ్యేందుకు ప్రస్తుత నిబంధనల నుంచి వినేశ్‌కు ప్రత్యేక మినహాయింపు ఇవ్వలేమని జస్టిస్ స్వర్ణకాంత శర్మ మధ్యంతర ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. వినేశ్ ఫొగాట్ మాతృత్వం, స్పోర్ట్స్ కెరీర్‌కు సంబంధించిన కీలక అంశాన్ని పరిశీలించేందుకు హైకోర్టు అంగీకరించింది. తల్లులైన మహిళా క్రీడాకారులు తిరిగి క్రీడల్లోకి వస్తున్నప్పుడు వారికి ఎదురయ్యే పరిస్థితులు, పోటీలకు సంబంధించిన అర్హత నిబంధనల మధ్య సమతుల్యత ఎలా సాధించాలన్న అంశాన్ని కోర్టు పరిశీలించనుంది. మాతృత్వం కారణంగా మహిళా క్రీడాకారిణి తన క్రీడా కెరీర్‌ను కొనసాగించాలా.. లేక తల్లిగా ఉండటానికే పరిమితం కావాలా అనే పరిస్థితి తలెత్తకూడదన్న అంశాన్ని హైకోర్టు ప్రస్తావించింది. 'నేను తల్లిగా ఉండటం, కెరీర్ కొనసాగించడం.. ఈ రెండింటిలో ఒకదాన్ని ఎంచుకోవాల్సిందేనా?' అనే ప్రశ్నకు సంబంధించిన అంశం ప్రాధాన్యం ఉందని పేర్కొంది. దీనిపై తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదని కోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణల్లో ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించనుంది.



# ఓపెనర్‌గా శాంసన్‌కే నా ఓటు: రహానే

టీ20ల్లో భారత్ ఓపెనర్ల విషయంలో తరచూ మార్పులు చేస్తోంది. శుభ్‌మన్ గిల్, సంజూ శాంసన్ మధ్య పోటీ నెలకొంది. అభిషేక్ శర్మ ఇప్పటికే తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. తర్వాత ఇషాన్ కిషన్ కూడా ఓపెనర్‌గా తన వాదన వినిపించాడు. అయితే అతడిని మూడో స్థానానికి పంపించారు. తాజాగా వైభవ్ సూర్యవంశీకి అవకాశం రావడంతో శాంసన్ మరోసారి జట్టులో చోటు కోల్పోయాడు. ఇంగ్లాండ్‌తో అరంగేట్ర సిరీస్‌లో వైభవ్ 14, 13, 15 పరుగులు చేశాడు. తర్వాత జింబాబ్వేతో సిరీస్‌లో మాత్రం అదరగొట్టాడు. మూడు మ్యాచ్‌ల్లో 151 పరుగులు చేశాడు. చివరి మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్ ఉత్తమ ఆటగాడి అవార్డును కూడా అందుకున్నాడు. ఇలాంటి సమయంలో భారత మాజీ బ్యాటర్ అజింక్య రహానే కీలక వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ కంటే సంజు శాంసన్‌కే మరో అవకాశం ఇవ్వాలని అభిప్రాయపడ్డాడు. వైభవ్‌కు భవిష్యత్తులో చాలా అవకాశాలు వస్తాయని చెప్పాడు. ప్రపంచకప్‌లో రాణించిన టాప్-3 బ్యాటర్లతోనే భారత్ ముందుకెళ్లాలని రహానే సూచించాడు. శాంసన్, అభిషేక్, ఇషాన్ కిషన్ టాప్-3లో ఉండాలని అన్నాడు. రెండు మూడు మ్యాచుల్లో విఫలమైనంత మాత్రాన శాంసన్‌ను పక్కన పెట్టడం సరికాదని చెప్పాడు. ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు శాంసన్‌ను తిరిగి జట్టులోకి తీసుకోవడంపై రహానే సంతోషం వ్యక్తం చేశాడు. ప్రపంచకప్‌లో శాంసన్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన విషయాన్ని గుర్తు చేశాడు. శాంసన్ మ్యాచ్ విన్నర్ అని పేర్కొన్నాడు. అతడి రాకతో జట్టు మరింత బలపడుతుందని చెప్పాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
శనివారం 12-9-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# పాపరాజీల పాపం.. సెలబ్రిటీలదే!

సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాల్లోకి పాపరాజీలు చొరబడుతున్నారని ఇప్పుడు పెద్దఎత్తున గగ్గోలు వినిపిస్తోంది. కెమెరాలు వెంటాడుతున్నాయని, కుటుంబ గోప్యతను గౌరవించడం లేదని, తమ వ్యక్తిగత జీవితాన్ని బహిరంగ ప్రదర్శనగా మార్చేస్తున్నారని సినీ ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సల్మాన్ ఖాన్, అంతకుముందు ప్రీతి జింటా వంటి పలువురు ప్రముఖుల విషయంలోనూ ఇలాంటి చర్చే తెరపైకి వచ్చింది. పాపరాజీల ప్రవర్తనలో హద్దులు దాటే సందర్భాలు లేవని చెప్పలేం. వ్యక్తిగత స్వేచ్ఛకు, కుటుంబ గోప్యతకు భంగం కలిగించడం ఏ రూపంలోనూ సమర్థనీయం కాదు. కానీ ఇక్కడ ఒక అసౌకర్యమైన ప్రశ్న మాత్రం తప్పదు. ఈ పాపరాజీ సంస్కృతికి ఇంత పెద్ద మార్కెట్‌ను సృష్టించింది ఎవరు? సెలబ్రిటీ సంస్కృతి పెరుగుతున్న కొద్దీ ప్రముఖుల ప్రతి కదలికను ప్రజలకు చూపించే పోటీ మొదలైంది. విమానాశ్రయంలో దిగిన దగ్గర నుంచి ఇంటి గుమ్మం దాటే వరకు కెమెరాలు వెంటపడ్డాయి. రెస్టారెంట్‌లో ఏం తిన్నారు? ఎవరితో కనిపించారు? ఏ దుస్తులు ధరించారు? ఎక్కడికి వెళ్లారు? కుటుంబంతో ఎక్కడ గడిపారు? ప్రేమలో ఉన్నారా? విడిపోయారా? పెళ్లి ఎప్పుడు? పిల్లల పేర్లు ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాల కోసం ప్రేక్షకుల్లో ఆసక్తి ఉందని చెప్పి పాపరాజీలు కెమెరాలతో పరుగులు పెట్టారు. కానీ ఆ ఆసక్తిని అంత పెద్ద వ్యాపారంగా మార్చడంలో సెలబ్రిటీల పాత్రను మాత్రం మరిచిపోవచ్చా? ఒకప్పుడు ప్రముఖులు తమ ప్రచారానికి పత్రికలు, టెలివిజన్ కార్యక్రమాలు, ఇంటర్వ్యూలపై ఆధారపడేవారు. తర్వాత సామాజిక మాధ్యమాలు వచ్చాయి. అక్కడ 'చూసిన వారి సంఖ్య', 'పంచుకున్న వారి సంఖ్య', 'అనుచరుల సంఖ్య' అన్నీ ఒక కొత్త కరెన్సీగా మారాయి. తమ సినిమాల ప్రచారం కోసం సెలబ్రిటీలు తమ వ్యక్తిగత జీవితంలోని ఎన్నో అంశాలను స్వయంగా బయటకు తీసుకొచ్చారు. పుట్టినరోజు వేడుకలు, కుటుంబ కార్యక్రమాలు, సెలవుల ఫొటోలు, ఇంటి లోపలి దృశ్యాలు, పిల్లల ఫొటోలు, బంధువులతో గడిపిన క్షణాలు.. అన్నీ అభిమానుల ముందుంచారు. ఎందుకు? అభిమానులతో అనుబంధం కోసం మాత్రమేనా? కాదు. ప్రచారం కోసం కూడా. ప్రజల్లో ఆసక్తి పెంచడం కోసం కూడా. తమ పేరును ఎప్పటికప్పుడు చర్చలో ఉంచుకోవడం కోసం కూడా. అక్కడే అసలు సమస్య మొదలైంది. ప్రజల ఆసక్తిని మీరు వ్యాపారంగా మార్చినప్పుడు, ఆ ఆసక్తిని వ్యాపారం చేసుకునే మరో వర్గం పుట్టకుండా ఉంటుందా? సెలబ్రిటీ తన వ్యక్తిగత జీవితాన్ని సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా ప్రదర్శించి కోట్లాది మందికి చూపిస్తాడు. అదే వ్యక్తి బయటకు వచ్చినప్పుడు కెమెరా తన వెంట రావడాన్ని మాత్రం పూర్తిగా అంగీకరించలేనని చెబుతాడు. ఈ రెండింటి మధ్య సరిహద్దు ఎక్కడ? ఇది తప్పకుండా చర్చించాల్సిన ప్రశ్న. అయితే దీనిని పాపరాజీలకు పూర్తి మినహాయింపుగా చూడటం కూడా తప్పే. బహిరంగ ప్రదేశంలో ఉన్నామనే పేరుతో ఎవరి వ్యక్తిగత జీవితాన్నైనా వెంటాడే హక్కు ఎవరికీ లేదు. ముఖ్యంగా పిల్లలు, కుటుంబ సభ్యులు, ఆరోగ్యం, వ్యక్తిగత సంబంధాలు వంటి అంశాల్లో గోప్యతను కాపాడాల్సిన బాధ్యత మీడియాపైనా, సామాజిక మాధ్యమ వేదికలపైనా ఉంది.



# విద్యుత్తు డిమాండ్.. డేంజర్!

తెలంగాణలో విద్యుత్తు డిమాండ్ ఆల్‌టైమ్ రికార్డుకు చేరింది. సెప్టెంబర్ 9న ఉదయం 10.41 గంటలకు 19,543 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైంది. గత ఏడాది ఇదే సమయంలో ఉన్న 15,906 మెగావాట్లతో పోలిస్తే ఇది ఏకంగా 23 శాతం అధికం. రాష్ట్ర విద్యుత్తు సంస్థలు ఈ డిమాండ్‌ను ఎలాంటి అంతరాయం లేకుండా తీర్చగలిగామని చెబుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు కూడా దీనిని తమ విద్యుత్తు నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనంగా చూపుతున్నారు.

సరఫరా చేయగలిగిన సామర్థ్యం అభినందనీయం. కానీ ఇక్కడ అసలు ప్రశ్న వేరొకటి. డిమాండ్ ఎందుకు పెరిగింది? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా కేవలం రికార్డు డిమాండ్‌ను ప్రభుత్వ విజయంగా ప్రచారం చేయడం పూర్తి చిత్రాన్ని ప్రజల ముందుంచదు. సెప్టెంబర్ నెలలో సాధారణంగా వేసవి తరహా విద్యుత్తు డిమాండ్ ఉండదు. కానీ ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. పగటి వేడితో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా ఉండటంతో ఇళ్లలో, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం పెరుగుతోంది. హైదరాబాద్‌లోనే సెప్టెంబర్ రెండో వారంలో వేసవిని తలపించే స్థాయిలో విద్యుత్తు డిమాండ్ నమోదవుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అంటే ప్రస్తుత విద్యుత్తు డిమాండ్‌లో ఒక ముఖ్యమైన భాగం అభివృద్ధి వేగానికి ప్రతిబింబం మాత్రమే కాదు.. వాతావరణ అసాధారణతకు కూడా ప్రతిబింబం. దేశవ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఆగస్టులో భారత విద్యుత్తు వినియోగం రికార్డు స్థాయిలో 169 బిలియన్ యూనిట్లకు చేరింది. ఎల్‌నినోకు అనుసంధానమైన వర్షపాత లోటు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా శీతలీకరణ పరికరాల వినియోగం పెరగడం దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి. కాబట్టి విద్యుత్తు డిమాండ్ పెరిగిందని సంబరపడటానికి ముందు దాని నాణ్యత, కారణం, నిలకడలను పరిశీలించాలి. ఇది కేవలం తెలంగాణ ప్రభుత్వానికి మాత్రమే వర్తించే ప్రశ్న కాదు. విద్యుత్తు డిమాండ్ పెరుగుతున్న కొద్దీ ఆర్థిక కార్యకలాపాలు పెరిగాయా? పరిశ్రమలు ఎక్కువగా పనిచేస్తున్నాయా? కొత్త పెట్టుబడులు వచ్చాయా? వ్యవసాయ రంగంలో వినియోగం పెరిగిందా? లేక వాతావరణం వేడెక్కడంతో ప్రజలు ఎక్కువగా ఏసీలు, కూలర్లు వాడుతున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానాలే వాస్తవ పరిస్థితిని తెలియజేస్తాయి. రికార్డు డిమాండ్‌ను తీర్చడం ఒక సామర్థ్యం. కానీ రికార్డు డిమాండ్ ఎందుకు వచ్చిందో అర్థం చేసుకోవడం పాలనా బాధ్యత. ఇంకో ముఖ్యమైన అంశం విద్యుత్తు సరఫరా భద్రత. దేశవ్యాప్తంగా పెరిగిన డిమాండ్ కారణంగా బొగ్గు ఆధారిత విద్యుత్తు కేంద్రాలపై ఒత్తిడి పెరిగింది. సెప్టెంబర్ 9 నాటికి దేశంలోని 59 బొగ్గు విద్యుత్తు కేంద్రాల్లో నిల్వలు కీలకంగా తక్కువ స్థాయికి పడిపోయినట్లు కేంద్ర విద్యుత్తు సంస్థ గణాంకాల ఆధారంగా నివేదికలు వెల్లడించాయి. తెలంగాణలోనూ సింగరేణి బొగ్గు సరఫరాపై ఒత్తిడి పెరిగినట్లు వార్తలు వచ్చాయి. ఆగస్టులో విద్యుత్తు సంస్థలకు సరఫరా చేసిన సింగరేణి బొగ్గులో దాదాపు 90 శాతం తెలంగాణలోని థర్మల్ విద్యుత్తు కేంద్రాలకే వెళ్లినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో "డిమాండ్ పెరిగింది.. మేం తీర్చాం" అనడం కంటే, సెప్టెంబర్ మాసంలో ఈ పరిస్థితి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి పరిణామాలు భవిష్యత్తులో విద్యుత్తు వ్యవస్థపై మరింత ఒత్తిడి తీసుకురావచ్చు. అందుకే తాత్కాలికంగా అదనపు విద్యుత్తు కొనుగోలు చేయడం, బొగ్గు నిల్వలు పెంచడం మాత్రమే పరిష్కారం కాదు. సౌర విద్యుత్తు, పవన విద్యుత్తు, నిల్వ వ్యవస్థలు, పంపిణీ వ్యవస్థ ఆధునీకరణ, డిమాండ్ నిర్వహణపై ప్రభుత్వం దీర్ఘకాలిక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా పగటి వేళ సౌర విద్యుత్తు అందుబాటులో ఉన్నా సాయంత్రం, రాత్రి వేళల్లో డిమాండ్‌ను ఎలా నిర్వహించాలన్నది కీలకంగా మారుతోంది. దేశవ్యాప్తంగా పగటి సౌర విద్యుత్తు ధరలు తక్కువగా ఉండగా, సౌర విద్యుత్తు అందుబాటులో లేని సమయాల్లో ధరలు గణనీయంగా పెరుగుతున్నాయన్నది ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్తు డిమాండ్‌ను తీర్చగలిగినందుకు అభినందనలు అందుకోవచ్చు. కానీ అంతటితో బాధ్యత ముగియదు. డిమాండ్ పెరుగుదలను అభివృద్ధి సూచికగా చూపించే ముందు, దాని వెనుక ఉన్న ఎల్‌నినో ప్రభావాన్ని కూడా ప్రజలకు చెప్పాలి. ఎందుకంటే వేడి పెరిగి ఏసీలు ఎక్కువగా తిరిగినా విద్యుత్తు డిమాండ్ పెరుగుతుంది. పరిశ్రమలు విస్తరించి ఉత్పత్తి పెరిగినా విద్యుత్తు డిమాండ్ పెరుగుతుంది. ఈ రెండింటినీ ఒకే గాటన కట్టడం మాత్రం సరైనది కాదు. రికార్డు విద్యుత్తు డిమాండ్ పాలకులకు గొప్పతనపు కొలమానం కాదు. దానిని అంతరాయం లేకుండా, తక్కువ ఖర్చుతో, పర్యావరణ హితంగా, భవిష్యత్తు అవసరాలకు సరిపడేలా నిర్వహించగలగడమే నిజమైన పాలనా సామర్థ్యానికి కొలమానం. తెలంగాణ ఇప్పుడు ఆ దిశగా ఆలోచించాల్సిన సమయం వచ్చింది.

**నాగయ్య సర్వోదయ**
(రిటైర్డ్ టీచర్), సంగారెడ్డి

## చావు రాజకీయాలు..
# ఛీ.. ఛీ!



రాజకీయాల్లో విమర్శలు సహజం. ఆరోపణలు కూడా సహజమే. ప్రత్యర్థి విధానాలను తప్పుబట్టడం, పాలనను ఎండగట్టడం, ప్రజా సమస్యలపై నిలదీయడం ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష హక్కు. కానీ రాజకీయ ప్రత్యర్థి వ్యక్తిగత జీవితం, ఆరోగ్యం, అనారోగ్యం, మరణం వంటి అత్యంత సున్నితమైన అంశాలను కూడా రాజకీయ ఆయుధాలుగా ఉపయోగించడం మాత్రం ప్రజాస్వామ్య విలువలకు మచ్చ. ప్రత్యర్థి చావును కోరుకోవడం, చావుతో పోల్చి అవమానించడం, అనారోగ్యాన్ని ఎగతాళి చేయడం.. ఇవి రాజకీయ విమర్శలు కావు. ఇవి రాజకీయాల పేరుతో దిగజారుతున్న విశృంఖలత్వానికి నిదర్శనాలు.

ఆంధ్రప్రదేశ్‌లో జగన్ విషయంలో అప్పట్లో చోటుచేసుకున్న వ్యాఖ్యల నుంచి, ఇప్పుడు తెలంగాణలో కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతలుగా చెప్పబడుతున్న వివాదాస్పద వ్యాఖ్యల వరకు ఒకే ప్రశ్న తలెత్తుతోంది. పార్టీలు మారుతున్నాయి.. అధికారాలు మారుతున్నాయి.. కానీ ప్రత్యర్థిపై ద్వేషాన్ని వ్యక్తిగత స్థాయికి తీసుకెళ్లే సంస్కృతి ఎందుకు మారడం లేదు? జగన్ విషయంలో అప్పటి రాజకీయ వాగ్వాదాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో ప్రజలు చూశారు. ఇప్పుడు కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని వచ్చిన వ్యాఖ్యలపై కూడా తీవ్ర రాజకీయ దుమారం రేగుతోంది. కేసీఆర్‌పై ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను తాజాగా కొన్ని మీడియా కథనాలు ప్రస్తావించాయి. ప్రజాస్వామ్యంలో ఒక నాయకుడిని విమర్శించడానికి అతని విధానాలే సరిపోతాయి. అతని పాలనా నిర్ణయాలను ప్రశ్నించవచ్చు. అవినీతి ఆరోపణలు ఉంటే ఆధారాలతో విచారణ కోరవచ్చు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టలేదని నిలదీయవచ్చు. అధికార దుర్వినియోగం జరిగిందని ఆరోపించవచ్చు. కానీ ఒక మనిషి చావును రాజకీయ నినాదంగా మార్చడం ద్వారా ఎవరి గౌరవం పెరగదు. ఇక్కడ అసలు ప్రమాదం ఒక వ్యక్తికి జరిగిన అవమానంతో ముగియదు. ఇలాంటి మాటలు రాజకీయ సంస్కృతిలో సాధారణమైతే, రేపు అదే భాష మరొక పార్టీ నాయకుడిపై ప్రయోగమవుతుంది. ఈరోజు కాంగ్రెస్ నేత ఒక మాట అంటే.. రేపు బీఆర్ఎస్ నేత మరో మాట అంటారు. ఎల్లుండి ఇంకో పార్టీ నాయకుడు ఇంకో అడుగు ముందుకేస్తాడు. చివరకు ప్రజా సమస్యలు కనుమరుగై, ఎవరు ఎవరిని ఎంత దారుణంగా తిట్టారన్నదే రాజకీయ చర్చగా మిగులుతుంది. ఇది కేవలం పార్టీల సమస్య కాదు. ప్రజాస్వామ్య నైతికతకు సంబంధించిన ప్రశ్న.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్న వేళ ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై విమర్శలు చేస్తోంది. కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ అసెంబ్లీ వద్ద ఆందోళన కూడా చేపట్టారు. రాజకీయ పోరాటం తీవ్రంగా ఉండటం తప్పు కాదు. అసెంబ్లీలో మాటల యుద్ధం జరగడం కూడా తప్పు కాదు. కానీ ఆ పోరాటం వ్యక్తుల ప్రాణాలపైకి వెళ్లిన క్షణం ప్రజాస్వామ్య సరిహద్దు దాటినట్టే. అధికారంలో ఉన్నవారికి మరింత బాధ్యత ఉంటుంది. ఎందుకంటే అధికార పార్టీకి చెందిన ఒక్క నాయకుడి మాటను కూడా ప్రజలు ప్రభుత్వ వైఖరిగా భావించే అవకాశం ఉంటుంది. అందుకే ముఖ్యంగా అధికార పార్టీ నాయకత్వం ఇలాంటి వ్యాఖ్యలను ప్రోత్సహించకూడదు. ఎవరైనా హద్దు మీరితే వారిని సమర్థించకుండా, "ఇది మా పార్టీ వైఖరి కాదు" అని స్పష్టంగా చెప్పగల రాజకీయ ధైర్యం ఉండాలి. అదే విధంగా ప్రతిపక్ష పార్టీలూ తమ నేతలకు నియంత్రణ నేర్పాలి. ప్రత్యర్థి బలహీనతను రాజకీయ అవకాశంగా చూడటం వేరు.. ప్రత్యర్థి ప్రాణాన్ని రాజకీయ ఆయుధంగా మార్చడం వేరు. రెండింటి మధ్య ఉన్న రేఖను చెరిపేస్తే రాజకీయాలు క్రమంగా వ్యక్తిగత కక్షల వేదికగా మారతాయి. ఇక సోషల్ మీడియా ఈ విషాన్ని మరింత వేగంగా వ్యాప్తి చేస్తోంది. ఒక నాయకుడు మాట్లాడిన అసభ్యమైన మాటకు లక్షలాది వీక్షణలు రావడం, పార్టీ అభిమానులు వాటిని వైరల్ చేయడం, ప్రత్యర్థులు దానికి మరింత ఘాటైన భాషలో సమాధానం ఇవ్వడం.. ఇలా ద్వేషానికి ప్రతిద్వేషం జతకడుతోంది. చివరికి రాజకీయ సంభాషణ కాదు.. రాజకీయ విషం మాత్రమే మిగులుతోంది. ప్రజలు రాజకీయ నాయకులను ఎన్నుకునేది తమ తరఫున పాలించడానికి. ఒకరినొకరు తిట్టుకోవడానికి కాదు. రైతు సమస్యలు, నిరుద్యోగం, విద్య, వైద్యం, ధరలు, సాగునీరు, పట్టణ మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు, పెట్టుబడులు.. ఇవే ప్రజల అసలు సమస్యలు. వాటిపై మాట్లాడాల్సిన సభల్లో ఒక నాయకుడి ఆరోగ్యం, మరొక నాయకుడి కుటుంబం, ఇంకొకరి వ్యక్తిగత జీవితం చర్చకు వస్తే అది ప్రజలకు జరుగుతున్న అన్యాయం. రాజకీయ ప్రత్యర్థి శత్రువు కాదు. రేపటి ప్రజాస్వామ్య భాగస్వామి. ఈ కనీస స్పృహ రాజకీయ నాయకుల్లో ఉండాలి.

జగన్ అయినా.. కేసీఆర్ అయినా.. చంద్రబాబు అయినా.. రేవంత్ రెడ్డి అయినా.. మోదీ అయినా.. మరెవరైనా సరే.. వారి విధానాలను తీవ్రంగా విమర్శించే హక్కు ప్రజలకు, ప్రతిపక్షాలకు ఉంది. కానీ ఎవరి మరణాన్ని కోరుకునే హక్కు ఎవరికీ లేదు. రాజకీయ ప్రత్యర్థి తప్పు చేస్తే ప్రజల ముందుంచాలి; చట్టాన్ని ఆశ్రయించాలి; ప్రజల తీర్పు కోరాలి. చావును కోరడం ప్రజాస్వామ్య పోరాటం కాదు. అది రాజకీయ దివాళాకోరుతనం. రాజకీయాల్లో ఓడిపోవచ్చు. ఎన్నికల్లో పరాజయం పొందవచ్చు. అధికారాన్ని కోల్పోవచ్చు. మళ్లీ అధికారంలోకి రావచ్చు. కానీ మాటల్లో మానవత్వాన్ని కోల్పోతే తిరిగి పొందడం చాలా కష్టం. అందుకే ఇప్పుడు అన్ని పార్టీలూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చింది. తమ ప్రత్యర్థిపై ఎంత ఘాటుగా విమర్శించామన్నది కాదు.. ఎంత దిగజారకుండా విమర్శించామన్నదే రాజకీయ నాయకుడి స్థాయిని నిర్ణయించాలి. చావు ఎవరికీ రాజకీయ విజయం కాదు. అనారోగ్యం ఎవరికీ రాజకీయ ఓటమి కాదు. మనిషి ప్రాణం పార్టీ జెండా కంటే పెద్దది. ప్రత్యర్థి ప్రాణాన్ని గౌరవించలేని రాజకీయానికి ప్రజల జీవితాలను గౌరవించే నైతిక హక్కు ఎలా వస్తుంది? రాజకీయాలు పోరాటంగా ఉండాలి.. పగగా కాదు. విమర్శగా ఉండాలి.. విషంగా కాదు. ప్రత్యర్థిని ఓడించాలి.. కానీ అతని మానవత్వాన్ని కాదు. చావు రాజకీయాలకు చరమగీతం పాడకపోతే.. రేపటి రాజకీయ భాష మరింత భయానకంగా మారే ప్రమాదం ఉంది.



**వెంకటేశ్ గుగ్గిళ్ల**
ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.